శుక్రవారం
23-12-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 181
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పండగల వేళ మరింత అప్రమత్తం

కరోనా మరోసారి కలకలం సృష్టిస్తోంది. చైనాలో వేగంగా వ్యాప్తి చెందుతున్న బీఎఫ్7 రకానికి చెందిన ఒమిక్రాన్ కేసులు భారత్‌లోనూ నమోదు కావడంతో భారత వైద్యమండలి ప్రజలను అప్రమత్తం చేసింది. కోవిడ్ నియంత్రణ పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని కోరింది.



2లో

రుషికొండ తవ్వకాల వ్యవహారంలో

జగన్ సర్కార్‌కు

ఝలక్!

ఐదుగురు కేంద్ర అధికారులతో కమిటీ

- గతంలో నియమించిన రాష్ట్ర అధికారుల తొలగింపు
- కొత్త కమిటీ వివరాలు కోర్టుకు పంపాలని సూచన
- సమగ్ర సర్వేతో జనవరి 31లోగా నివేదికివ్వాలి
- హైకోర్టు కీలక ఆదేశాలు జారీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖపట్నం రిషికొండ తవ్వకాల కేసులో జగన్ సర్కార్‌కు హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రిషికొండ తవ్వకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వ అధికారులతో మాత్రమే కమిటీ వేయాలని కేంద్ర పర్యావరణ, అటవీశాఖను హైకోర్టు గురువారం ఆదేశించింది. రిషికొండపై అనుమతులకు మించి తవ్వకాలు జరుపుతున్నారని దాఖలైన పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. గతంలో దీనిపై ఐదుగురు సభ్యులతో కమిటీ వేయాలని హైకోర్టు ఆదేశించగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ముగ్గురిని ఇందులో నియమించింది. దీనిపై విశాఖ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ, జనసేన పార్టీ నేత మూర్తి యాదవ్ అభ్యంతరం తెలుపుతూ పిటిషన్లు దాఖలు చేశారు. తాజాగా విచారణ జరిపిన హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారి తొలగింపునకు ఆదేశాలు ఇచ్చింది. రిషికొండ తవ్వకాలపై నియమించిన కమిటీలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ముగ్గురు అధికారులు ఉండటాన్ని చూస్తుంటే కేంద్రం, రాష్ట్రం కుమ్మక్కైనట్లు భావించాల్సి వస్తుందని కీలక వ్యాఖ్యలు చేసింది. కమిటీలో మొత్తం ఐదుగురు కేంద్ర ప్రభుత్వ అధికారులతో ఉండాలని స్పష్టం చేసింది. అక్రమ తవ్వకాలను నిగ్గు తేల్చేందుకు సమగ్ర సర్వే చేయాలని, జనవరి 31 లోపు నివేదిక ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించింది. కొత్త

- మిగతా 2 లో

కానరాని ఆపన్నహస్తం

- అన్నదాతల పడిగాపులు
- సిద్ధంకాని తుపాను నష్ట నివేదికలు
- బస్తాల్లోనే మొలకెత్తుతున్న ధాన్యం
- కొనుగోళ్లకు సవాలక్ష ఆంక్షలు
- సీఎం చెప్పేదొకటి...జరిగేదొకటి
- ఎకరాకు రూ.25వేలు ఇవ్వాలని రైతు నేతల డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రైతన్న జీవితం లాటరీగా మారింది. విత్తనం ఎద పెట్టేదగ్గర నుండి పంట ఇంటికొచ్చేవరకు, ఆ పంటను సొమ్ము చేసుకునే వరకు అంతా ప్రకృతి, పాలకుల కరుణా కటాక్షాలపైనే ఆధారపడాల్సిన దయనీయ స్థితి. ఇందుకు ఈ నెలలో 'మాండస్' తుపానునే ఉదాహరణగా పేర్కొనవచ్చు. పంట చేతికొచ్చే సమయానికి తుపాను సృష్టించిన విలయతాండవం రైతును నట్టేట ముంచింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట మరో పది రోజుల్లో సొమ్ము అవుతుందని ఎదురుచూస్తున్న సమయంలో ఈనెల 10 నుంచి 12వరకు మాండస్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ

- మిగతా 2 లో

వెనక్కు తగ్గని విపక్షం

- చైనాతో ఘర్షణపై చర్చకు డిమాండ్
- దద్దరిల్లిన పార్లమెంటు
- ఇటు బహిష్కరణ..అటు వాయిదాలు

న్యూదిల్లీ: భారత్-చైనా సరిహద్దు వివాదం పార్లమెంటును కుదిపివేసింది. దీనిపై చర్చ కోసం ఉభయసభల్లో మొదటిరోజు నుంచి ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే కేంద్రం అంగీకరించడం లేదు. గురువారం కూడా చైనాతో వివాదంపై చర్చ కోసం ప్రతిపక్షాల ఎంపీలు పట్టుపట్టారు. సభాపతులు ససేమిరా అనడంతో ఎంపీలు ఆందోళనకు దిగారు. దీంతో ఉభయసభలు రసాభాస అయ్యాయి. లోక్‌సభలో వాయిదాల పర్వం కొనసాగగా రాజ్యసభ కార్యకలాపాలను విపక్షాలు ఉమ్మడిగా బహిష్కరించాయి. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఎన్‌సీపీ, టీఎంసీ, డీఎంకే, ఎస్పీ, జేఎంఎం, ఆర్‌జేడీ, జేడీ(యూ), ఆప్ ఎంపీలంతా వాకౌట్ చేశారు. అంతకుముందు బీహార్‌ను అవమానించినందుకు సభ నాయకుడు పీయూష్ గోయల్ క్షమాపణలు చెప్పాలని వారంతా డిమాండ్ చేశారు. బీహార్ రాష్ట్రాన్ని, అక్కడి ప్రజలను గోయల్ అవమానించారని అన్నారు. దీంతో దిగొచ్చిన గోయల్ ఎవరి మనోభావాలను దెబ్బతీయడం తన ఉద్దేశం కాదని వివరణ ఇచ్చుకున్నారు. తన మాటలను ఉపసంహరించుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. రాజీవ్‌గాంధీ ఫౌండేషన్, భారత్‌లోని 38వేల చదరపు కిమీలతో పాటు పీఓకేలోని కొంత భాగంలో చైనా ఆధీనంలోకి వెళ్లడాన్ని ప్రస్తావించారు. దీంతో ప్రతిపక్ష సభ్యులంతా లేచి నిలబడి

- మిగతా 2 లో

అగ్రిగోల్డ్ ఉద్యమకారులపై

కేసు కొట్టివేత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అగ్రిగోల్డ్ ఉద్యమకారులపై ఐదేళ్ల క్రితం విజయవాడ పోలీసులు నమోదు చేసిన కేసును గురువారం విజయవాడ కోర్టు కొట్టివేసింది. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని, కంపెనీకి వారు చెల్లించిన డిపాజిట్ల సొమ్మును తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యాన 2017 మార్చిలో విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలో 17 మంది బాధితులు పాల్గొన్నారు. మూడు రోజుల తర్వాత వీరి ఆరోగ్యపరిస్థితి క్షీణిస్తోందన్న కారణంతో సత్యనారాయణపురం పోలీసులు దీక్షను భగ్నం చేశారు. 2017 మార్చి 17వ తేదీ వారిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుల తరపున న్యాయవాదులు ఎన్.సాయిశంకర్, జీవీ రాజులు

- మిగతా 2 లో

గవర్నర్ వ్యవస్థ

దుర్వినియోగం

- దేశవ్యాప్తంగా 29న రాజ్‌భవన్ల ముందు నిరసన
- సీపీఐ కేంద్ర కమిటీ పిలుపు
- బీజేపీ హయాంలో సమాఖ్య వ్యవస్థ ధ్వంసం
- దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్షాలపై దాడులు
- రైతాంగ సమస్యలపై త్వరలో సమైక్య ఉద్యమ కార్యాచరణ
- ఏపీ అప్పులు, వడ్డీలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్రప్రభుత్వం గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగం చేయడానికి వ్యతిరేకంగా ఈనెల 29వ తేదీన విజయవాడ రాజ్‌భవన్ వద్ద నిరసనకు దిగనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వెల్లడించారు. గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ సమితి ఈనెల 29న దేశ వ్యాప్తంగా రాజ్‌భవన్ల వద్ద నిరసనకు పిలుపునిచ్చిందన్నారు. విజయవాడ దాసరిభవన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో ఈ మేరకు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమాఖ్య(ఫెడరల్) వ్యవస్థ ధ్వంసానికి పాల్పడుతోందని రామకృష్ణ మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తోందని, స్వతంత్ర

- మిగతా 2 లో

వారాల, మధురాంతకానికి

కేంద్ర సాహిత్య పురస్కారం

న్యూదిల్లీ: ఇద్దరు తెలుగు రచయితలను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వరించింది. మనోధర్మపరాగం నవల రాసిన మధురాంతకం నరేంద్ర, అనువాద విభాగంలో 'ఆకుపచ్చ కవితలు' రాసిన వారాల ఆనంద్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు లభించాయి. దీనితోపాటు మాజీ ఐఏఎస్ ఎం.రాజేంద్రన్ రచించిన చారిత్రక నవల 'కాలాపానీ'కి సైతం ఈ పురస్కారం లభించింది. ప్రముఖ భావకవి, పద్మభూషణ్ గుల్జార్.. హిందీ, ఉర్దూ, పంజాబీ భాషల్లో కవిత్వం రాశారు. గుల్జార్ రాసిన గ్రీన్ కవితలను పవన్ కే వర్మ ఆంగ్లానువాదం తోడ్పాటుతో ద్విభాషా కవి వారాల ఆనంద్ 'ఆకుపచ్చ కవితలు' పేరుతో తెలుగులోకి అనువదించారు. ఇందులోని 58 కవితలు ప్రకృతికి సంబంధించినవే. మనిషి, ప్రకృతి మధ్య అనుబంధాన్ని ఈ కవితల ద్వారా ఎంతో సూటిగా చెప్పారు. అలాగే, అసోంకు చెందిన ప్రముఖ జర్నలిస్టు, రచయిత మనోజ్ కుమార్ గోస్వామి రాసిన 'భూల్ సత్య' పుస్తకానికీ కేంద్ర సాహిత్య పురస్కారం లభించింది. వచ్చే ఏడాది మార్చి 11న ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. విజేతలకు తామ్ర ఫలకం, రూ.50వేల నగదు అందజేస్తారు.

తమిళ పోరాటచరిత్ర అందరికీ తెలుస్తుంది: రాజేంద్రన్

కాలాపానీ నవలలో కలాయకోయిల్ యుద్ధంలో ఓటమి తర్వాత దురైసామి, శివగంగా పాలకుడు వెంగై పెరియా ఉదయన్న దేవర్‌తో పాటు 72 మంది వనవాసానికి వెళ్లడాన్ని రాజేంద్రన్ వర్ణించారు. ఈ రచనకు సాహితీ పురస్కారం లభించడంపై రచయిత రాజేంద్రన్ హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమిళనాడు పోరాట చరిత్ర దేశప్రజలకు తెలుస్తుందని ఆయనన్నారు. 'ఈ అవార్డుతో మన పూర్వీకుల త్యాగాలు, శౌర్యానికి గుర్తింపు లభించిందని భావిస్తా. స్వాతంత్ర్యం కోసం జరిగిన సిపాయి తిరుగుబాటుకు 56 ఏళ్ల పూర్వం తమిళనాడులో స్వాతంత్ర్య సమరం మొదలైంది. ప్రజలకు కాలాపానీ శిక్ష పడేది. అంటే గుర్తుతెలియని ద్వీపానికి పంపేవారు. అది మరణశిక్షకు మించిన శిక్ష' అని రాజేంద్రన్ అన్నారు.

ఇదీ లోకం!

కరోనా సాకు మాత్రమే

కేంద్రమంత్రి లేఖపై రాహుల్ మండిపాటు

గురుగ్రామ్: 'భారత్ జోడోయాత్ర'ను నిలిపివేసేందుకు కేంద్రంలోని మోదీ సర్కారు సాకులు వెతుకుతోందని కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా పేరు చెప్పి యాత్రను నిలిపివేయాలని కేంద్రం చెబుతోందని మండిపడ్డారు. భారత్ జోడోయాత్ర గురువారం హరియాణాలోని నూహుకు చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జోడో యాత్ర త్వరలో కశ్మీర్‌కు చేరుకుంటుందని, ఇది ఓర్వ లేని కేంద్ర ప్రభుత్వం కోవిడ్ వ్యాప్తి చెందుతున్నందున వెంటనే యాత్రను ఆపండని చెబుతోందన్నారు. ఈ యాత్ర వల్ల నష్టం కలుగుతుందని భయపడుతున్న బీజేపీ... కోవిడ్ వ్యాప్తి పెరుగుతున్నట్లు సాకు చెబుతోందని రాహుల్ ధ్వజమెత్తారు. 'దేశానికి ఉన్న శక్తిని, సత్యాన్ని చూసి వారందరూ భయపడుతున్నారు. ఇది వాస్తవం' అని రాహుల్ అన్నారు. రాహుల్‌తో పాటు అనేకమంది కాంగ్రెస్ నేతలు సైతం కేంద్రం వైఖరిపై మండిపడ్డారు. 'నిన్న రాహుల్ గాంధీ లేఖ అందుకున్నారు. నేడు ప్రధాన మంత్రి పరిస్థితులను సమీక్షిస్తున్నారు. రేపు భారత్ జోడోయాత్ర దిల్లీకి చేరుకోనుంది. ఇదంతా ఎలా



- మిగతా 2 లో

నిర్లక్ష్యం వద్దు

- అందరూ మాస్కులు ధరించాలి- టీకాలు తీసుకోండి
- కోవిడ్‌పై ఉన్నతస్థాయి సమీక్షలో ప్రధాని మోదీ
- పరీక్షలు- నిఘా పెంచాలని అధికారులకు ఆదేశాలు

న్యూదిల్లీ: కోవిడ్ వైరస్ ముప్పు తొలగిపోలేదని ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి నొక్కిచెప్పారు. పండగ సమయం కావడంతో బయటకు వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలని హితవు పలికారు. టీకాలు తీసుకోవాలని, కోవిడ్ ప్రొటోకాల్ పాటించాలని అన్నారు. కోవిడ్ కట్టడికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కొత్త వేరియంట్ల విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వద్దని సూచించారు. కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, జీనోమ్ సీక్వెన్సింగ్‌పై దృష్టిపెట్టాలన్నారు. ముఖ్యంగా అంతర్జాతీయ విమానాశ్రయాల్లో నిఘా పెంచాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. కొన్ని దేశాల్లో కోవిడ్ ఉధృతి నేపథ్యంలో దేశంలో కొత్త వేరియంట్ కలకలం రేపింది. దీంతో మోదీ గురువారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుగా ఆరోగ్య వ్యవస్థను పటిష్ఠపర్చుకోవాలని, అన్ని మౌలిక వసతులు ఉండేలా చూడాలని అధికారులతో అన్నారు. వాక్సినేషన్, కొత్త వేరియంట్లపై దృష్టి పెట్టాలన్నారు. పరీక్షలు, జీనోమ్ సీక్వెన్సింగ్ పెరగాలని అన్నారు. ఐఎన్ఎస్ఏ-సీఓజీ జీనోమ్ సీక్వెన్సింగ్ ల్యాబ్‌ల్లోనే జీనోమ్ స్వీక్వెన్సింగ్ జరగడం వల్ల కొత్త వేరియంట్లను త్వరగా గుర్తించవచ్చని

ఆయన సూచించారు. కోవిడ్ వసతుల ఆడిట్ నిర్వహించాలని రాష్ట్రాలకు ఆదేశాలిచ్చారు. ఆక్సిజన్ సిలిండర్లు, పీఎస్ఏ ప్లాంట్లు, వెంటిలేటర్లు, మానవవనరులతో పాటు ఆసుపత్రుల్లో అన్ని వసతులు, అత్యవసర సేవలు, మందులన్నీ అందుబాటులో ఉండేలా చూడాలని మోదీ ఆదేశించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రతి ఒక్కరూ కోవిడ్ నిబంధనలు పాటించాలని స్పష్టంచేశారు. సమావేశానికి కేంద్రమంత్రులు అమిత్‌షా, మన్‌సుఖ్ మాండవీయ, జ్యోతిరాదిత్య సింధియా, ఎస్.జైశంకర్, అనురాగ్ ఠాకూర్, నీతి ఆయోగ్ సీఈవో పరమేశ్వరన్ అయ్యర్, కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా తదితరులు హాజరయ్యారు.

నేపాలీ కాంగ్రెస్ ప్రధాని అభ్యర్థిగా డ్యూబా

ఖాట్మాండు : నేపాలీ కాంగ్రెస్ ప్రధాని అభ్యర్థిగా షేర్ బహదూర్ డ్యూబా ఎంపికయ్యారు. ఆయన వరుసగా ఐదుసార్లు ప్రధానిగా పనిచేశారు. ఇప్పుడు ఆరోసారి ఈ బాధ్యతలు స్వీకరించనున్నారు. బుధవారం ఆయనను పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నుకున్నట్లు పార్టీ వర్గాలు ప్రకటించాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో డ్యూబా తన ప్రత్యర్థి గగన్ కుమార్ థాపాపై 39 ఓట్లతో గెలిచారు. తన గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీని ఎటువంటి అడ్డంకులు లేకుండా ముందుండి నడిపిస్తానని చెప్పారు. నేపాల్‌లో నవంబర్ 20న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నేపాలీ కాంగ్రెస్ అత్యధిక మెజారిటీ సాధించిన ఏకైక పార్టీగా అవతరించిన సంగతి తెలిసిందే.

చైనా నుంచి వచ్చిన వ్యక్తికి కోవిడ్ పాజిటివ్

అహ్మదాబాద్: చైనా నుంచి తిరిగి వచ్చిన వ్యక్తికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో ఆయన నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం ల్యాబ్‌కు పంపారు. బీఎఫ్.7 వేరియంట్ చైనాను వణికిస్తున్నది. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు కరోనా పరీక్షలు చేయాలని అన్ని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. దీంతో ఇతర దేశాల నుంచి రాష్ట్రానికి వచ్చే ప్రయాణికులకు తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించాలని గుజరాత్ ఆరోగ్య మంత్రి రుషికేశ్ పటేల్ అధికారులను ఆదేశించారు. గుజరాత్‌లోని భావ్‌నగర్‌కు చెందిన 34 ఏళ్ల బిజినెస్ మ్యాన్ పనుల నిమిత్తం ఇటీవల చైనా వెళ్లాడు. ఈ నెల 19న గుజరాత్‌కు తిరిగి వచ్చాడు. ఈ నేపథ్యంలో కొత్త నిబంధనల మేరకు అధికారులు ఆయనకు కరోనా పరీక్ష నిర్వహించగా పాజిటివ్‌గా తేలింది. దీంతో ఆ వ్యక్తి నుంచి సేకరించిన నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం గాంధీనగర్‌లోని ల్యాబ్‌కు పంపారు. మరోవైపు దేశంలో ఇప్పటికే బీఎఫ్.7 వేరియంట్ కరోనా కేసుల సంఖ్య నాలుగుకు చేరింది. ఇందులో రెండు కేసులను గుజరాత్‌లో గుర్తించారు.

కాలేయం ఇచ్చేందుకు టీనేజర్‌కు అనుమతి

కేరళ హైకోర్టు సంచలన నిర్ణయం

తిరువనంతపురం: అనారోగ్యంతో బాధ పడుతున్న తండ్రిని ఎలాగైనా బతికించుకోవాలని తన కాలేయంలో కొంత భాగం ఇచ్చేందుకు టీనేజర్ కుమార్తె సిద్ధపడింది. కానీ అందుకు వయసు అడ్డంకిగా మారింది. దాంతో ఆ అమ్మాయి కేరళ హైకోర్టును ఆశ్రయించగా అనుకూల తీర్పు వెలువడింది. త్రిస్సూర్‌లో దేవనంద (17) తండ్రి ప్రతీష్‌కు హెపటోసెల్యులోమ క్యాన్సర్ వచ్చింది. దాంతో ఆయనకు కాలేయ మార్పిడి అనివార్యమైంది. దేవనంద కాలేయం మాత్రమే మ్యాచ్ కావడంతో ఆమె అందుకు సిద్ధమైంది. అయితే వయస్సు 17 ఏళ్లు కావడంతో వైద్యులు ఒప్పుకోలేదు. దాంతో దేవనంద హైకోర్టులో పిటిషన్ వేసింది. అవయవ దానం కోసం జరిపే వైద్య పరీక్షల్లో ఫిట్‌గా ఉన్నట్టు తేలితే తనను పెద్ద అమ్మాయిగా పరిగణించాలని దేవనంద ఆ పిటిషన్‌లో పేర్కొంది. దేవనంద కేసును అధ్యయనం చేసేందుకు కేరళలోని అవయవదాన సంస్థ ఒక కమిటీని ఏర్పాటు చేసింది. అందులోని ముగ్గురు నిపుణులైన డాక్టర్లు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ తప్ప మరో దారి లేదని, కాలేయం మార్పిడి తదుపరి పరిణామాలు దేవనందకు తెలుసని చెప్పారు. కోర్టు దేవనందకు కాలేయం దానం చేసేందుకు అనుమతిచ్చింది.

మీరిచ్చేది విరాళం కాదు... పెట్టుబడి

అమెరికా కాంగ్రెస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు

తన ప్రసంగంలో సభ్యులను మెప్పించిన జెలెన్‌స్కీ

వాషింగ్టన్: రష్యాతో యుద్ధం జరుగుతున్న క్రమంలో తమకు ఆర్థిక, ఆయుధ సాయం చేయాలని పాశ్చాత్య దేశాలను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కోరారు. సాయాన్ని కూడగట్టే పనిలో ఉన్న ఆయన యుద్ధం మొదలైన 300వ రోజు అమెరికాలో పర్యటించారు. ఈ సందర్భంగా అమెరికా కాంగ్రెస్‌లో ప్రసంగించారు. రష్యాపై పోరాడేందుకు అమెరికా అందించే ఆర్థిక సాయం అంతర్జాతీయ భద్రత, ప్రజాస్వామ్యానికి పెట్టుబడి అవుతుందేగానీ విరాళం కాబోదని నొక్కిచెప్పారు. ఖాకీ వస్త్రధారణలోనే ఆయన కాంగ్రెస్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్‌కు సాయంపై అమెరికాలో కొందరు రిపబ్లికన్లు అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో జెలెన్‌స్కీ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. అమెరికా కాంగ్రెస్‌లో జెలెన్‌స్కీ మాట్లాడుతూ 'అమెరికా కాంగ్రెస్ వేదికగా సభ్యులతో, అమెరికన్లు అందరితో మాట్లాడటం గౌరవంగా భావిస్తున్నా. ఎన్ని కష్టాలు వచ్చినా... ఎటువంటి క్లిష్టపరిస్థితులు ఎదురైనా ఉక్రెయిన్ మనోధైర్యాన్ని కోల్పోలేదు. దృఢంగా నిలబడింది. శత్రువులను మట్టికరిపిస్తోంది. ఉక్రెయిన్ సజీవంగా ఉంది.. రష్యాకు తలొగ్గలేదు' అని అన్నారు. జెలెన్‌స్కీ ఆంగ్లంలో ప్రసంగిస్తుండగా అనేక సందర్భాల్లో ఆయన చేసిన వ్యాఖ్యలను సభ్యులు ప్రశంసించారు. సభలో రిపబ్లికన్లు, డెమొక్రాట్లు లేచి నిలబడి ఆయనను ప్రోత్సహించారు. తన ప్రసంగంతో అందరినీ ఆకట్టుకున్న ఆయన 'ఉక్రెయిన్ లొంగిపోదు' అని ఉద్ఘాటించారు. రష్యాతో యుద్ధాన్ని రెండవ ప్రపంచ యుద్ధం, అమెరికా విప్లవంతో పోల్చారు. సభకు వచ్చిన జెలెన్‌స్కీకి ఉక్రెయిన్ జెండాతో తొలుత స్వాగతం పలికారు. జెలెన్‌స్కీ అంతకుముందు శ్వేతసౌధంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో భేటీ అయ్యారు. 10 అంశాల ఉక్రెయిన్ శాంతి ఫార్ములాను బైడెన్‌కు వివరించినట్లు చెప్పారు. తమ శాంతి ఫార్ములాకు బైడెన్ మద్దతిచ్చారన్నారు. అమెరికా నాయకత్వం దృఢంగా ఉండేందుకు మద్దతిస్తారని ఆశిస్తున్నానని సభ్యులతో జెలెన్‌స్కీ అన్నారు.

ఇజ్రాయిల్‌లో నెతన్యాహు ప్రభుత్వం ఏర్పాటు

టెల్ అవీవ్: ఇజ్రాయిల్‌లో ఎట్టకేలకు కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయింది. సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్నప్పటికీ బెంజిమిన్ నెతన్యాహు ఎంతో తర్జనభర్జన తర్వాత నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగారు. ఈ మేరకు ఆయన అధికారికంగా ప్రకటించారు. 'ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాం. మీకు తెలియజేస్తున్నాం' అని నెతన్యాహు కార్యాలయం ఒక ప్రకటన వెలువరించింది. సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు డెడ్‌లైన్ ముగిసేందుకు 30 నిమిషాల కంటే తక్కువ సమయం ఉండగా ఈ ప్రకటన వెలువడింది. నెతన్యాహు ఇజ్రాయిల్ ప్రధానిగా 1996-99, 2009-21 వరకు పనిచేశారు. లికుడ్ పార్టీ నాయకుడైన నెతన్యాహు నవంబరులో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలుచుకున్నారు. నాలుగేళ్లలో దేశంలో ఐదవసారి ఎన్నికలు జరిగాయి. కాగా, జియోనిజం పార్టీ నేత ఇటామర్ బెన్ గ్విర్‌కు ప్రజా భద్రతా మంత్రి పదవి దక్కింది. ఇజ్రాయిల్ పోలీసులను నియంత్రించే అధికారం ఆయనకు లభించింది.

చైనా పరిస్థితి ఆందోళనకరం: డబ్ల్యూహెచ్ఓ

జెనీవా: చైనాలో కోవిడ్ విజృంభించింది. కేసులు భారీగా నమోదు అవుతున్నాయి. మరణాలు అధికంగా సంభవిస్తున్నాయి. దీంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) అధ్యక్షుడు టెడ్రోస్ అధోనమ్ ఘెబ్రేయెసస్ ఆందోళన వ్యక్తంచేశారు. 'చైనాలో పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. వ్యాధి వ్యాప్తి తీవ్రత ఎక్కువగా ఉన్నది. ఆసుపత్రుల్లో రోగులు పెరుగుతున్నారు. అత్యవసర ఆరోగ్య సేవలు అవసరం అవుతున్నాయి. పౌరులకు టీకాలిచ్చే విషయంలో చైనాకు డబ్ల్యూహెచ్ఓ పూర్తిగా సహకరిస్తుంది. ఆరోగ్యవ్యవస్థ, క్లినికల్ సంరక్షణకూ మద్దతిస్తుంది' అని టెడ్రోస్ వెల్లడించారు. జీరో కోవిడ్ విధానాన్ని చైనాలో అమలు చేస్తున్న విషయం విదితమే.

ఇరాక్‌లో మరో పేలుడు - ఇద్దరు సైనికుల మృతి

బీరుట్: ఉత్తర ఇరాక్‌లో మరోమారు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఇద్దరు సైనికులు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ మేరకు అధికారులు గురువారం తెలిపారు. మఖ్‌మౌర్ జిల్లా నుంచి వాహనంలో సైనికులు వెళుతున్నప్పుడు ఐఈడీ పేలిందన్నారు. ఈ దాడికి ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత వహించలేదు. ఈ వారంలో ఇటువంటి వరుస ఘటనలు చోటుచేసుకున్నాయి. సోమవారం ఫులుజాలోని అల్బుబాలి గ్రామంలో సాయుధుడు జరిగిన కాల్పుల్లో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురికి గాయాలయ్యాయి. ఆదివారం రియాద్ జిల్లాలోని అలి అల్ సుత్రా గ్రామంలో పేలుడు సంభవించగా తొమ్మిది మంది పోలీసులు మరణించారు.దీంతో ప్రధాని మహమ్మద్ షియా అల్ సుదానీ బుధవారం భద్రతా అధికారులతో సమావేశమై ఉగ్రదాడులపై చర్చించారు. కాగా, ఐదేళ్ల కిందటే ఐసిస్‌పై విజయం సాధించినట్లు ఇరాకీ అధికారులు ప్రకటించినాగానీ దాడులు జరుగుతూనే ఉన్నాయి.

పండగల వేళ మరింత అప్రమత్తం

కేంద్రమంత్రి మాండవీయ

న్యూదిల్లీ: చైనా, అమెరికా సహా కొన్ని ఇతర దేశాల్లో కరోనా వైరస్ మళ్లీ విజృంభిస్తుండటంతో భారత్‌లో నెలకొన్న పరిస్థితిపై కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ లోక్‌సభలో గురువారం ఓ ప్రకటన చేశారు. కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ర్యాండమ్ శాంపిల్స్ సేకరణ మొదలైందని మంత్రి వెల్లడించారు. కొత్త వేరియంట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. జులై-నవంబర్ మధ్య భారత్‌లో బీఎఫ్ 7 రకానికి చెందిన నాలుగు కేసులు నమోదయ్యాయని తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో ప్రజలు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని గుర్తు చేశారు. ఎప్పటికప్పుడు మారుతున్న కరోనా వైరస్ స్వభావం ప్రపంచ ఆరోగ్య రంగానికి ప్రమాదకరంగా మారుతోందన్నారు. ప్రతి కోవిడ్ కేసును జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపాలని ఇప్పటికే రాష్ట్రాలకు సూచించామని, తద్వారా కొత్త వేరియంట్లను గుర్తించేందుకు వీలుంటుందని తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు, రాబోయే పండుగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రాలు మరింత అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు, శానిటైజర్ల వాడకంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని రాష్ట్రాలను కోరారు. కరోనా మహమ్మారి నియంత్రణలో ఆరోగ్యశాఖ చురుగ్గా పనిచేస్తోందన్నారు. కాగా, కరోనా భయాలు మళ్లీ వెంటాడుతున్న వేళ రద్దీ ప్రాంతాల్లో ప్రజలంతా మాస్కులు తప్పకుండా ధరించాలని కేంద్రం నిన్న విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో గురువారం రాజ్యసభకు హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ మాస్కు ధరించారు. అంతేకాకుండా లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్‌తో పాటు పార్లమెంట్ సభ్యులంతా మాస్కులు ధరించి సభకు హాజరయ్యారు.

కోవిడ్ విజృంభిస్తోంది...జాగ్రత్త

ప్రజలకు భారత వైద్యమండలి హెచ్చరిక

న్యూదిల్లీ: కరోనా మరోసారి కలకలం సృష్టిస్తోంది. చైనాలో వేగంగా వ్యాప్తి చెందుతున్న బీఎఫ్7 రకానికి చెందిన ఒమిక్రాన్ కేసులు భారత్‌లోనూ నమోదు కావడంతో భారత వైద్యమండలి ప్రజలను అప్రమత్తం చేసింది. కోవిడ్ నియంత్రణ పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని కోరింది. బహిరంగ ప్రదేశాల్లో కచ్చితంగా మాస్కు ఉపయోగించాలని, భౌతిక దూరం పాటించాలని, నిత్యం సబ్బుతో చేతులు కడుక్కోవాలని కోరుతూ గురువారం ప్రకటన విడుదల చేసింది. శానిటైజర్ ఉపయోగించాలని చెప్పింది. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ లోక్‌సభలో మాట్లాడుతూ...భారత్‌లో కోవిడ్ కేసుల పెరుగుదలపై కేంద్రం ఓ కన్నేసి ఉంచిందని చెప్పిన గంటల వ్యవధిలోనే ఐఎంఏ ఈ ప్రకటన జారీ చేసింది. మరోవైపు అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ర్యాండమ్‌గా నమూనాలు సేకరించి, పరీక్షించాలని మాండవీయ ఆదేశించడంతో ఆ ప్రక్రియ ఈరోజు ఉదయం నుంచి ప్రారంభమైంది. వీలైనంత వరకు ప్రజలు జనసమూహాలకు దూరంగా ఉండాలని, వివాహాలు, రాజకీయ, సామాజిక సమావేశాలు వాయిదా వేసుకోవడం మంచిదని ఐఎంఏ సూచించింది. అత్యవసరమైతే తప్ప అంతర్జాతీయ ప్రయాణాలు చేయొద్దని ప్రజలను కోరింది. జ్వరం, గొంతు నొప్పి, జలుబు, విరేచనాలు తదితర సమస్యలేమైనా కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరింది. వీలైనంత తొందరగా ముందస్తు దోసు తీసుకోవాలని సూచించింది. వివిధ దేశాల్లో కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్న తరుణంలో ప్రజలను భారత వైద్యమండలి అప్రమత్తం చేస్తోంది. తక్షణమే కోవిడ్ నిబంధనలు పాటించాలని ప్రజలను కోరుతోంది. గడిచిన 24 గంటల్లో అమెరికా, జపాన్, దక్షిణ కొరియా, ఫ్రాన్స్, బ్రెజిల్ తదితర దేశాల్లో 5.37 లక్షలకు పైగా కేసులు నమోదయ్యాయి. భారత్‌లోనూ 145 కొత్త కేసులు గుర్తించారు. ఇందులో 4 కేసులు చైనాలో భయాందోళనలు సృష్టిస్తున్న బీఎఫ్7 రకానికి చెందినవని ఐఎంఏ ప్రకటనలో పేర్కొంది. 2021 నాటి పరిస్థితులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. అత్యవసర ఔషధాలు, ఆక్సిజన్, అంబులెన్స్ సర్వీసులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్రాల ఆరోగ్యశాఖ మంత్రులు, సంబంధిత విభాగాలను అప్రమత్తం చేసింది. ప్రస్తుతం పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఐఎంఏ తన ప్రకటనలో పేర్కొంది.

కానరాని ఆపన్నహస్తం

(మొదటిపేజీ తరువాయి)

వర్షాలు పంటలను సర్వ నాశనం చేశాయి. ఇది రైతులపై ప్రకృతి ప్రకోపమైతే...ఈ విపత్తు ముగిసి పది రోజులు దాటినా నష్టంపై ఇంతవరకు అధికార యంత్రాంగం నివేదికలు సిద్ధం చేయకపోవడం, రైతులను ఆదుకునే కనీసం చర్యలు చేపట్టకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం. రైతులకు అంచనాలకందని భారీ నష్టం సంభవించింది. తుపాను ప్రభావానికి కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, శ్రీ సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వేలాది ఎకరాల్లో పంట నీట మునిగి, కొట్టుకుపోయి ఎందుకు పనికిరాకుండా పోయింది. మిర్చి పూత, పిందె రాలిపోయి మోడువారాయి. మొక్కజొన్న, పొగాకు మొక్క విరిగి ధ్వంసమైంది. కోత కొచ్చిన వరి నీట మునిగింది. కల్లాల్లోని ధాన్యం తడిసిపోయింది.చివరకు బస్తాలకు ఎత్తిన ధాన్యం సైతం తడిసి మొలకలెత్తే పరిస్థితి ఏర్పడింది. రైతాంగానికి తీరని గుండెకోతను మిగిల్చింది. ప్రకృతి కటాక్షం, కన్నెర్రకు బలి కావడం సహజమే. కాని పాలకుల నిర్లక్ష్యాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో వ్యవసాయ, రెవిన్యూశాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి యుద్ధప్రాతిపదికన నష్టాన్ని అంచనా వేసి, నివేదికలు సిద్ధం చేయాలని, బాధిత రైతాంగానికి ఎకరానికి కనీసం రూ.25వేలు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని రైతు సంఘం నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చేతికొచ్చిన పంట నాశనమై, అప్పులిచ్చిన వారికి ఏమి సమాధానం చెప్పాలో, వారికి డబ్బు ఎలా చెల్లించాలో దిక్కుతోచని రైతులు ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇంత దయనీయంగా ఉన్నప్పటికీ అధికారం యంత్రాంగంలో మాత్రం చలనం లేదు. నష్ట నమోదుకు కూడా అనేక ఆంక్షలు విధిస్తున్నారు. నష్టాన్ని తక్కువగా చూపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఉదాహరణకు వరి కోతలు పూర్తయి ఓదెలపై ఉన్న పంట విషయంలో తుపాను నష్టం కింద నమోదు చేసేందుకు నిబంధనలు వర్తించవని అధికారులు నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒకపక్క సమీక్షా సమావేశాల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి...రంగుమారినా, తడిసినా మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేయాలని, పంట నష్టపోయిన రైతుల పట్ల ఉదారంగా వ్యవహరించాలని చెబుతుండగా, ఆచరణలో మాత్రం అధికారులు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. రబీలో వేసిన పంటలకు ఈ-క్రాప్ బుకింగ్ చేయడం లేదు. నష్టపోయిన పంటల ఎన్యుమరేషన్ చాలా ప్రాంతాల్లో జరగడం లేదు. చిత్తూరు జిల్లాల్లో అయితే ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో పంట ఇంకా నీటి మునిగి ఉన్న దయనీయ పరిస్థితులు కనపడుతున్నాయి. ఈ ప్రాంతాల్లో వేరుశనగ పంట ఇక బతికే అవకాశం లేదు. అరటి, బొప్పాయి, మొక్కజొన్న, జొన్న, చెరకు, పొగాకు తోటలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మాండస్ నష్టం వేల కోట్లలోనే ఉంటుందని, అంచనాలకు కూడా అందడం లేదని అధికారులే పేర్కొంటున్నారంటే నష్టం ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం ఇకనైనా యుద్ధప్రాతిపదికన నష్ట నివేదికలు సిద్ధం చేసి, బాధిత రైతులకు ఎకరానికి రూ.25వేలు నష్టపరిహారం అందజేసి అన్నదాతలను ఆదుకోవాలని రైతు సంఘం నేతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కరోనా సాకు మాత్రమే

(మొదటిపేజీ తరువాయి)

సాగుతోందో ఇప్పుడు మీరే ఆలోచించండి' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిం జైరామ్ రమేష్ మండిపడ్డారు. కోవిడ్‌ను అడ్డం పెట్టుకుని కేంద్రం భారత్ జోడో యాత్రను లక్ష్యంగా చేసుకుందన్నారు. కర్ణాటక, రాజస్థాన్‌లలో బీజేపీ చేస్తున్న యాత్రల మాటేమిటని ఆయన ప్రశ్నించారు.

జోడో యాత్ర అడ్డుకట్టకు కుట్ర: శివసేన

న్యూదిల్లీ: భారత్ జోడో యాత్ర నిలిపివేయాలంటూ కేంద్ర ఆరోగ్య శాఖ జారీ చేసిన ఆదేశాలపై ఉద్ధవ్ ఠాక్రేకు చెందిన శివసేన వర్గం ఘాటుగా స్పందించింది. రాహుల్ భారత్ జోడో యాత్రను నిలిపివేసేందుకు కేంద్రం కరోనా వైరస్‌ను ప్రయోగించిందని విమర్శించింది. చట్టం ద్వారా, కుట్రతో భారత్ జోడో యాత్రను అడ్డుకోలేక కేంద్ర ప్రభుత్వం కరోనా వైరస్‌ను విడుదల చేసినట్లు కనిపిస్తోందని ఠాక్రేకి చెందిన శివసేన మాతృ పత్రిక సామ్నా సంపాదకీయంలో పేర్కొంది. భారత్ జోడోయాత్ర కారణంగా కరోనా కేసులు పెరుగుతాయనే భయం సమంజసమైనదేనని, అయితే మూడేళ్ల క్రితం కరోనా విధ్వంసం సృష్టించిన సమయంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను గుజరాత్‌కు ఆహ్వానించడంతో పాటు ఆయన గౌరవార్థం లక్షలాది మందిని సమీకరించ లేదా అని పత్రిక పేర్కొంది. ఆ సమయంలో కరోనా ఆంక్షలు ఎందుకు పాటించలేదని ప్రశ్నించింది. కరోనా ఆంక్షలు పాటించకంటే భారత్ జోడోయాత్రను నిలిపివేయాలంటూ కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి లేఖ రాసిన సంగతి తెలిసిందే. మాస్కులు ధరించాలని, వాక్సిన్ వేయించుకున్నవారినే యాత్రలో పాల్గొనేలా చూడాలని ఆ లేఖలో పేర్కొన్నారు. కరోనా నిబంధనలు పాటించకపోతే యాత్ర నిలిపివేయాలని అన్నారు.

గవర్నర్ వ్యవస్థ దుర్వినియోగం

(మొదటిపేజీ తరువాయి)

దర్యాప్తు సంస్థలైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఆదాయపన్ను (ఐటీ)శాఖను ప్రతిపక్షాలపై దాడులకు ఉసిగొల్పుతోందని ధ్వజమెత్తారు. రాజకీయ పక్షపాతంతో ప్రతిపక్ష నేతల ఇళ్లకు వెళ్లి బెదిరించడానికీ, వారిపై కేసులు పెట్టడానికే ఇవి ఉపయోగపడుతున్నాయన్నారు. 'ఒక్క రోజు ఈడీ, సీబీఐని నా చేతిలో పెడితే సగం మంది బీజేపీ నేతలను జైళ్లలో పెట్టిస్తా' అన్న దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యలను ఆయన గుర్తుచేశారు. బీజేపీ నేతలు ఎన్ని తప్పులు చేసినా బయట తిరగొచ్చనీ, ప్రతిపక్షాలపై దాడులకు మాత్రమే స్వతంత్ర సంస్థల్ని దుర్వినియోగం చేస్తున్నారని దుయ్యబట్టారు. పైగా ఇతర పార్టీల్లో ఉంటూ అవకతవకలు, అవినీతికి పాల్పడిన వారంతా బీజేపీ కండువా కప్పుకున్న వెంటనే పవిత్రులుగా మారిపోతున్నారంటూ ఎద్దేవా చేశారు. వాళ్లెవరూ జైళ్లకు పోవడం లేదనీ, బీజేపీ కండువా కప్పుకోకుంటే మాత్రం వెంటపడుతున్నారనీ, కేసులతో వేధిస్తున్నారని, ఈ విధానాలను ప్రజలంతా నిరసించాలన్నారు. ప్రజాస్వామ్యంలో స్వతంత్ర సంస్థలు స్వేచ్ఛగా పనిచేయాలేయాన్నారు. తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాలలో గవర్నర్ల వ్యవస్థను పూర్తిస్థాయిలో దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీకి ఏజెంట్ల తరహాగా గవర్నర్లు పనిచేస్తున్నారనీ, కొందరైతే ఏకంగా బీజేపీ కండువాలు కప్పుకున్న తరహాగా కార్యక్రమాల్ని చేస్తూ రాజ్యాంగ వ్యవస్థను, సమాఖ్య వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారని తప్పుబట్టారు. గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలంటూ సీపీఐ ముందు నుంచీ డిమాండ్ చేస్తోందనీ, అందులో భాగంగానే ఈనెల 29వ తేదీన ఆంధ్రప్రదేశ్ గవర్నరు కార్యాలయం వద్ద (రాజ్‌భవన్) నిరసన చేపట్టనున్నామని వెల్లడించారు.

రాష్ట్రంలో ఎక్కడ చూసినా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ, ఇది చాలా బాధాకరమని రామకృష్ణ చెప్పారు. చాలా ప్రాంతాల్లో మొత్తం పంటలన్నీ దెబ్బతిన్నాయని, అక్కడక్కడా పండిన చోట గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. కొనుగోలు చేసేవారే లేరని, తుపాను ప్రభావంతో కల్లాల్లోని వరి పంటను పూర్తిగా రైతులు కోల్పోవాల్సివచ్చిందని వివరించారు. దీనిపై జగన్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆర్బీకే కేంద్రాలపై ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందనీ, అక్కడ రైతులకు కనీసం సంచులు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ధాన్యం కొనుగోలుపైన, పంట నష్టంపైన జగన్ మాట్లాడటం లేదనీ, సీఎం పదేపదే 2024 ఎన్నికలే లక్ష్యంగా ఆలోచిస్తున్నారేగానీ, రైతాంగ శ్రేయస్సుపై దృష్టి పెట్టడం లేదని చెప్పారు. ఎమ్మెల్యేలు గడపగడపకూ వెళ్లడం కాదు...పొలాలకి వెళ్తే రైతుల సమస్యలు తెలుస్తాయన్నారు.

చాలా జిల్లాల్లో ఇప్పటికే సీపీఐ అధ్వర్యంలో రైతాంగ సమస్యలపై పెద్దఎత్తున కార్యక్రమాల్ని చేస్తున్నామని, ఇటీవల అనంతపురం, కర్నూలులో వేలాదిమంది రైతులతో ధర్నాలు చేశారన్నారు. రైతులంతా సుభిక్షంగా ఉన్నారంటూ జగన్ చేస్తున్న వ్యాఖ్యల్ని తప్పుబట్టారు. అసలు గ్రామాల్లో పంట పండిందా? లేదా? అని పరిశీలించేవారే లేరనీ, అలాంటప్పుడు రైతులు సుభిక్షంగా ఎలా ఉంటారని సీఎంను ప్రశ్నించారు. ఈ మూడేళ్లల్లో 1670 మంది రైతులు అప్పులపాలై, ఆత్మహత్యలకు పాల్పడ్డారని సాక్షాత్తూ పార్లమెంటులో చెప్పారని గుర్తుచేశారు. దానిపై సీఎం ఎందుకు జవాబివ్వరంటూ నిలదీశారు. 3070 మంది వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారనీ, దానిపైనా సీఎం ఏ మాత్రమూ స్పందించడం లేదన్నారు. రైతులంతా సుభిక్షంగా ఉంటే, ఇంతమంది రైతులు, కూలీలు ఎందుకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన రైతాంగ సమస్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు. ఈనెల 27, 28 తేదీల్లో జరిగే సీపీఐ కార్యదర్శివర్గం, కార్యవర్గ సమావేశాల్లో రైతాంగ సమస్యలపై కూలంకుషంగా చర్చించి, రాబోయే రోజుల్లో సమైక్య ఉద్యమానికి కార్యాచరణ రూపొందిస్తామని ప్రకటించారు.

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో చాలా రాష్ట్రాల ప్రభుత్వాలు ఉద్యోగస్తులకు వేతనాలు ఇవ్వడం లేదనీ, వారంతా రోడ్డెక్కుతున్నారని వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. కేంద్రమంత్రి ఆంధ్రప్రదేశ్ పేరు చెప్పకపోయినా...ఆంధ్రప్రదేశ్‌లోనే ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందనడానికి ఆమె వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు సైతం తమకు వేతనాలు రావడం లేదంటూ రోడ్డెక్కారనీ, ఇవాళ రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందని, మొత్తం అప్పులపాల్జేశారని, అప్పులు పుడితేనే వేతనాలు ఇచ్చే పరిస్థితి నెలకొందన్నారు.

రాష్ట్రానికి అప్పు ఎంత ఉందో? దానికి వడ్డీ ఎంత కట్టాలో ప్రజలు తెలుసుకోవాలని సూచించారు. జగన్ దిగిపోయే నాటికి రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్లు అప్పు ఉండబోతోందంటూ ఆర్థికవేత్తలు చెబుతున్నారని వ్యాఖ్యానించారు. ఈ అప్పుకుగాను ఏటా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.లక్ష కోట్లు వడ్డీ చెల్లించాల్సిన దుస్థితి ఉందనీ, అవి ఎక్కడ నుంచి వస్తాయంటూ ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్రంలోని అప్పులు, వాటికి చెల్లిస్తున్న వడ్డీలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, ఏపీ చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ ఉద్యమకారులపై కేసు కొట్టివేత

(మొదటిపేజీ తరువాయి)

వాదించగా, గురువారం విజయవాడ కోర్టు ఈ కేసును కొట్టివేసింది.

కేసులన్నీ ఎత్తివేయాలి: తిరుపతిరావు డిమాండ్

అగ్రిగోల్డ్ బాధితులపై నమోదు చేసిన అక్రమ కేసులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.తిరుపతిరావు డిమాండ్ చేశారు. అలాగే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానం మేరకు బాధితులందరికీ డిపాజిట్ సొమ్ము చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

జగన్ సర్కార్‌కు ఝలక్ !

(మొదటిపేజీ తరువాయి)

అధికారుల కమిటీ వివరాలు హైకోర్టుకు పంపాలని సూచించింది.

ఆ భవనాలు పాఠశాలలకే అప్పగించండి

పాఠశాలల ప్రాంగణాల్లో గతంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు, పంచాయతీ భవనాల వ్యవహారం హైకోర్టులో మరోసారి విచారణకు వచ్చింది. హైకోర్టు ఆదేశాల్ని లెక్కచేయకుండా ఈ భవనాల్ని నిర్మించిన వ్యవహారంలో న్యాయస్థానం ఆదేశాల మేరకు సీఎస్, ఇతర ఐఏఎస్‌లు న్యాయమూర్తి ముందు హాజరయ్యారు. సీఎస్, పంచాయతీరాజ్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలను ఉద్దేశించి హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మించిన ఆర్బీకేలు, పంచాయతీ భవనాలను విద్యాశాఖకు అప్పగించాలని ఆదేశించింది. దాదాపు 40 కోట్ల రూపాయలతో భవన నిర్మాణాలు చేపట్టామని అధికారులు కోర్టుకు తెలిపారు. భవనాలు కూల్చివేయాల్సి వస్తే వాటికైన ఖర్చు ప్రతి రూపాయి ప్రిన్సిపల్ సెక్రటరీ నుండి ఫీల్డ్‌స్థాయి అధికారి వరకు వసూలు చేస్తామని హైకోర్టు హెచ్చరించింది.

దీంతో పాఠశాలలో నిర్మించిన భవనాలను పాఠశాలలకు వినియోగిస్తామని అధికారులు తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో భవన నిర్మాణాలు చేపట్టడం వల్ల పాఠశాల వాతావరణం దెబ్బతింటుందన్న పిటిషనర్ తరపు న్యాయవాది లక్ష్మీ నారాయణ వాదనతో న్యాయస్థానం ఏకీభవించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులతో కమిటీ వేసి నివేదిక అందించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను వచ్చే నెల 20కి వాయిదా వేసింది.

వెనక్కు తగ్గని విపక్షం

(మొదటిపేజీ తరువాయి)

గోయల్ మాటలను ఖండించారు. చైర్మన్ జగదీప్ ధన్కర్ జోక్యం చేసుకొని సభను సజావుగా సాగనివ్వాలని, సభ్యులంతా ఎవరి స్థానాల్లో వారు కూర్చోవాలని సూచించారు. మధ్యాహ్నం ఒంటిగంటలకు తన చాంబర్‌లో కలవాలని సభా నాయకుడు, ప్రతిపక్ష నాయకుడికి సూచించారు. దీనికి ఖర్గే స్పందిస్తూ చర్చలు సభలో జరగాలేగానీ రహస్యంగా కాదన్నారు. ఈ క్రమంలో అధికార-విపక్షాల మధ్య గొడవతో సభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జోక్యం చేసుకొని గతంలో చైనాపై చర్చను సభలో బీజేపీ సభ్యుడు కిరణ్ రిజిజు కోరితే తనను తన కార్యాలయంలో కలవాలని అప్పటి మంత్రి ప్రణబ్ ముఖర్జీ సూచించారని గుర్తుచేశారు. దీంతో వామపక్షాలతో పాటు కాంగ్రెస్, ఎన్‌సీపీ, టీఎంసీ, డీఎంకే, ఎస్‌పీ, జేఎంఎం, ఆర్‌జేడీ, జేడీ(యూ), ఆప్ ఎంపీలు వాకౌట్ చేశారు. సభ మొదలైనప్పటి నుంచి చైనాతో సరిహద్దు వివాదంపై చర్చ కోసం ప్రతిపక్షాల ఎంపీలు డిమాండ్ చేస్తూనే ఉన్నారు.

అయితే 267 నిబంధన కింద సభ కార్యకలాపాలను రద్దు చేయాలని 12 నోటీసులు అందాయని, అవి నిబంధనల ప్రకారం లేవని చైర్మన్ అనడంతో విపక్ష సభ్యులు మండిపడ్డారు. సరిహద్దులో ఏం జరుగుతోందో ప్రజలకు తెలియాలని ఖర్గే నొక్కిచెప్పారు. సభ మర్యాదను కాపాడాలని, కార్యకలాపాలను సజావుగా జరగనివ్వాలని సభ్యులకు ధన్కర్ సూచించారుగానీ విపక్షాల ఎంపీల నినాదాలు ఆగలేదు. దీంతో ధన్కర్ ఆందోళన వ్యక్తం చేశారు. 'ఈ పరిస్థితుల్లో నేను నిస్సహాయుడిగా ఉన్నాననిపిస్తోంది. ఎవరి స్థానాల్లో వారు కూర్చోండి. వెల్‌లోకి వచ్చి మీరు ఇప్పుడు చేసేదానికి పరిణామాలు ఏళ్ల తరబడి వెంటాడుతాయి. సభా మర్యాదను సభ్యులు పరిరక్షించే విధంగా సభా నాయకుడు వ్యవహరించడం లేదు. కఠినచర్యలు తీసుకునేలా నన్ను బలవంతం చేయొద్దు. అదే జరిగితే అందుకు కట్టుబడతానేగానీ వెనక్కి తీసుకోను' అని అన్నారు. మరోవైపు లోక్‌సభలోనూ ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. సభ కార్యకలాపాలు ప్రారంభం కాగానే చైనాపై చర్చ కోసం ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో సభ వరుసగా నాలుగు సార్లు వాయిదా పడింది. ఆపై సాయంత్రం 4.30 గంటలకు తిరిగి సమావేశమైంది. అయితే ప్రతిపక్ష సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. వారి నినాదాల నడుమ జన్ వికాస్ (నిబంధనల సవరణ) బిల్లు, 2022ను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టారు. అనంతరం లోక్‌సభను వాయిదా వేస్తున్నట్లు సభాపతిగా వ్యవహరించిన రమాదేవి ప్రకటించారు. అంతకుముందు కోవిడ్-19 పరిస్థితి, కట్టడికి ప్రభుత్వ చర్యలపై కేంద్ర ఆరోగ్య మంత్రి మాండవియా ప్రకటన చేశారు.

బీజేపీ ఓటమే లక్ష్యం

- దానివి నీతిమాలిన రాజకీయాలు
- వైసీపీ ప్రభుత్వంలో కొందరి చేతుల్లోనే అధికారం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-చల్లపల్లి: అంబానీ, ఆదానీలకు ఊడిగం చేస్తూ, మతోన్మాద రాజకీయాలు చేస్తున్న బీజేపీని 2024 ఎన్నికల్లో ఓడించడమే లక్ష్యంగా పనిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లా సీపీఐ జనరల్ బాడీ సమావేశం చల్లపల్లి చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ రామకృష్ణ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. కేంద్రంలో ఉన్నది పేరుకే ఎన్డీఏ ప్రభుత్వ మనీ, నడిపేది ఆర్ఎస్ఎస్ అన్నారు. నరేంద్ర మోదీ రెండోసారి ప్రధాని అయ్యాక ఫక్తు ఆర్ఎస్ఎస్ అజెండాను అమలుచేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అన్నిరంగాల్లోనూ విఫలమైందన్నారు. దేశాన్ని అప్పుల ఊబిలో ముంచి అంబానీ..ఆదానీలకు దేశసంపదను దోచిపెడుతున్నారని దుయ్యబట్టారు. నల్లధనాన్ని మోదీ ఎందుకు వెనక్కు తీసుకురాలేదని ప్రశ్నించారు. గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగ పర్చడం, కార్పొరేట్ మీడియాను 90శాతం చెప్పుచేతల్లో పెట్టుకుంటూ ఎనిమిదేళ్ల కాలంలో తొమ్మిది రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వాలను కూలగొట్టి బీజేపీ పాలన తీసుకువచ్చారని తెలిపారు. 18వేల కోట్ల కాంట్రాక్ట్ ఇచ్చి తెలంగాణలో రాజగోపాలరెడ్డిని పార్టీలో చేర్చుకున్నారనీ, వందల కోట్ల ఆశచూపి ఎమ్మెల్యేల కొనుగోలుకు బేరాలు సాగిస్తున్నారని ఆరోపించారు. నీతిమాలిన రాజకీయాలను బీజేపీ ప్రేరేపిస్తోందన్నారు.

సీపీఐని బలోపేతం చేయాలి

సీపీఐని బలోపేతం చేయాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకుండా దేశ రాజకీయాలను ప్రభావితం చేయలేరన్నారు. విజయవాడలో జరిగిన జాతీయ మహాసభల్లో పార్టీలో సరికొత్త ఉత్సాహాన్ని ఇచ్చాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ లక్ష్యంగా ఒకే ఎజెండాతో ముందుకు సాగాలన్నారు. మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె. రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శులు అడ్డాడ ప్రసాద్ బాబు, తాతయ్య ప్రసంగించారు. సీపీఐ సీనియర్ నాయకులు మాలెంపాటి కాంచనరావు, హనుమా నుల సురేంద్రనాథ్ బెనర్జీ, పరుచూరి శ్రీనివాసరావు, రావి బాబూరావు, గుత్తికొండ రామారావు తదితరులు పాల్గొన్నారు. ఇటీవల మృతిచెందిన సీపీఐ పార్టీ, ప్రజానాట్య మండలి నేతల మృతికి సంతాపంవ్యక్తం చేశారు.

రాష్ట్రంలో అరాచక పాలన

రాష్ట్రంలో అరాచక, అప్రజాస్వామిక పరిపాలన సాగుతోందని రామకృష్ణ విమర్శించారు. కృష్ణాజిల్లా చల్లపల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షాలు ఎవరూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడేందుకు వీల్లేదనీ, చలో అసెంబ్లీ నినాదం చేయటానికి వీల్లేని విధంగా ప్రతిపక్షాల గొంతునొక్కుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి అలా ఉందన్నారు. పత్తి, వేరుశనగ, వాణిజ్య పంటలు సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోతే వరిపండించే రైతులూ అనేక సమస్యలతో సతమతమవుతున్నారనీ, ఆక్వా రైతులు క్రాప్ హాలిడే అంటున్నారంటే పరిస్థితి ఏస్థాయిలో ఉందో అర్థమవుతోందన్నారు. ముఖ్యమంత్రి గ్రామాలకు వచ్చి రైతులను కలిసి వారి స్థితిగతులను తెలుసుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి: కేవీవీ ప్రసాద్

రాష్ట్రంలో రైతుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. మాండస్ తుపాను కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రైతులను పరామర్శించి భరోసా ఇవ్వడం నామమాత్రంగా జరిగిందనీ, స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. ఎంటీయూ 1061 రకం పుట్టిన నాటి నుంచి ఏ గ్రేడ్లో ఉంటే ఈ ఏడాది సాధారణ రకంలో మార్చారనీ, మిల్లర్లతో కుమ్మక్కై ఇలా చేశారని రైతులు భావిస్తున్నట్లు తెలిపారు. 1061 రకాన్ని ఏ గ్రేడ్‌లోనే కొనసాగించాలనీ, లేకుంటే రైతులు నష్టపోతారన్నారు. వర్షాలకు మినుము పంట పోయిందనీ..తక్షణమే మినుము విత్తనాలు ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయశాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రులు రైతు సంఘాలతో సమావేశమై రైతుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

ఏం అభివృద్ధి చేశారని 175 సీట్లు గెలుస్తారు...?

రాష్ట్రంలో ఏం అభివృద్ధి చేశారని 175 సీట్లకు 175 స్థానాలు గెలుస్తారని రామకృష్ణ ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, మంత్రులు అందరినీ డమ్మీలు చేశారని విమర్శించారు. అన్ని కులాలకూ పదవులు ఇచ్చామని ముఖ్యమంత్రి చెబుతున్నారనీ, అధికారం మాత్రం కొందరివద్దే ఉందన్నారు. ప్రభుత్వ ఐదేళ్ల కాలం ముగిసేనాటికి రాష్ట్ర అప్పు 10లక్షల కోట్లకు చేరుతుందనీ, ఏటా అప్పు, వడ్డీ లక్ష కోట్లు కట్టాలనే అంచనా ఉన్నట్లు తెలిపారు. ఇంత అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించిన ముఖ్యమంత్రి ఏమైనా అభివృద్ధి చేశారా అని ప్రశ్నించారు. కాలువలు తవ్వరు, ప్రాజెక్టులు కట్టరు, పరిశ్రమలు తీసుకురారు, ఉన్నవాటిని వెళ్లగొడతారంటూ విమర్శించారు.

కేజీబీవీ ఉపాధ్యాయులకు నవంబర్ వేతనాలు ఇవ్వాలి

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి నవంబర్ వేతనాలు చెల్లించాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కేజీబీవీ టీచర్లకు 22 రోజులు దాటినప్పటికీ ఇంతవరకు వేతనాలు జమ చేయలేదన్నారు. ఈ నెల 25న క్రిస్మస్ పండుగ ఉందని, ప్రతినెల ఒకటో తేదీనే ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలు చెల్లించేలా తగిన ఆదేశాలు జారీజేయాలన్నారు.

ఏపీకి రూ.1,702 కోట్లు చెల్లించండి

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు కారుమూరి విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ వ్యవస్థ చెల్లించాల్సిన రూ.1,702 కోట్లు తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వర రావు కేంద్రాన్ని కోరారు. 2012-13 ఆర్థిక సంవత్సరం నుంచి 2017-18 వరకు కేంద్ర ఆహార ప్రజాపంపిణీ శాఖ రూ.1,702.90 కోట్లు బకాయి ఉందన్నారు. ఢిల్లీలో గురువారం కేంద్ర ఆహార ప్రజాపంపిణీ శాఖ అధ్వర్యంలో నిర్వహించిన సమావేశం లో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన అంశాలపై ఏకరువు పెట్టారు. ఈ మేరకు కేంద్ర ఆహార ప్రజాపంపిణీ శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఆరేళ్లుగా ఉన్న బకాయిలు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. 2014-15 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ బకాయి పడిన రూ.963.07 కోట్లను కూడా ఇప్పించాలని మంత్రి కారుమూరి కోరారు. వాటికి సంబంధించిన డాక్యుమెంట్లను పలుమార్లు కేంద్రానికి సమర్పించామన్నారు. వరి ధాన్యానికి వినియోగించే గోనె సంచుల విషయంలోనూ కేంద్రం నగదు చెల్లించాలనీ, కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖ డిప్యూటీ సెక్రటరీని ఆయన కోరారు. హమాలీలకు చెల్లించాల్సిన మండి లేబర్ చార్జీలు కూడా కేంద్రమే ఇవ్వాల్సి ఉందన్నారు. క్వింటాలుకు రూ.22 వంతున కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉన్న ఒప్పందం ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరం వరకూ మండి లేబర్ చార్జీలు చెల్లించాల్సి ఉందని వివరించారు. ధాన్య సేకరణ, ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత కట్టుదిట్టంగా అమలు చేసేందుకు అవసరమైన సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాల్సిన అవసరముందనీ, దీనికి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కారుమూరితో పాటు పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్ కుమార్, సంస్థ ఎండీ వీరపాండ్యన్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి మంత్రులు రాజీనామా చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రైతులను, కార్మికులను మోసంచేసి, అవినీతిలో కూరుకుపోయిన రాష్ట్ర మంత్రులు గుమ్మనూరు జయరాం, అంబటి రాంబాబు వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా ఆసుపత్రిలో 2006లో ఓ ప్రైవేటు కంపెనీ 444 ఎకరాలు కొనుగోలు చేసిందని, ఎకరాకు రూ.22 వేలు చెప్పి, రూ.20 వేలు మాత్రమే రైతులకు చెల్లించిందన్నారు. రైతు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చిందని వివరించారు. అవేమీ నెరవేరకపోవడంతో రైతుల ఆందోళనతో కంపెనీ భూములను తిరిగి రైతులకిప్పిస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రాష్ట్ర మంత్రి జయరాం అధికారంలోకి వచ్చాక ఆ భూములనే కుటుంబ సభ్యుల పేర కొనుగోలు చేయడం రైతులను మోసగించడమేనన్నారు. తాను భూముల్ని కొన్న మాట వాస్తవమేనని మంత్రి స్వయంగా అంగీకరించారని తెలిపారు. కోర్టు కేసులో ఉన్న భూములను మంత్రి అనుచరులు రైతులతో బలవంతంగా ఎకరాకు 4 వేలతో లీజ్ అగ్రిమెంట్ చేయించుకుని బెదిరింపులకు పాల్పడడం దుర్మార్గమని ఖండించారు. రిజిస్ట్రేషన్ ధరకే రైతులకు ఇచ్చేస్తానని ఇప్పుడు ప్రకటించడం రైతులను వంచించడమేనని, ఐటీ శాఖకు అటాచ్ అయిన భూములను రైతులకు మంత్రి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. బేషరతుగా ఆ భూముల్ని రైతులకు అప్పగించాలని, రైతులకు దక్కాల్సిన భూముల్ని మంత్రి జయరాం కాజేయడం అమానుషమని అన్నారు.

సత్తెనపల్లిలో హోటల్ సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేస్తుండగా మృతి చెందిన వారికి వచ్చిన నష్టపరిహారంలో వాటా కోసం మంత్రి అంబటి రాంబాబు ప్రాకులాడటాన్ని తప్పుపట్టారు. భవన నిర్మాణ సంఘం ఆందోళనతో నష్ట పరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చి, వచ్చిన రూ.5 లక్షల్లో 2.5 లక్షలు డిమాండ్ చేయడం సిగ్గుచేటన్నారు. హోటల్ యజమాని కుమారుడు ఖర్చుల కింద రు.2.5 లక్షలు ఇచ్చారనీ, వైసీపీ మంత్రి డబ్బులు డిమాండ్ చేయడం గర్హనీయమని శ్రీనివాసరావు అన్నారు. ఆ ప్రమాద సమయంలో మరో కుటుంబానికి నష్టపరిహారం కోసం వాటా అడిగానని మంత్రి చెప్పడం ప్రజలను తప్పుదారిపట్టించడమేనని పేర్కొన్నారు. వెంటనే నష్టపోయిన కుటుంబానికి పరిహారం ఇవ్వాలనీ, కార్మికుల కష్టార్జితంలో వాటా అడిగిన మంత్రికి పదవిలో కొనసాగే అర్హత లేదనీ, వెంటనే రాజీనామా చేయాలని, లేకుంటే ముఖ్యమంత్రే వారిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

విశ్వవిద్యాలయాలను అధికార పార్టీ కార్యాలయాలుగా మార్చొద్దు

- ఫ్లెక్సీలతో ప్రాంగణాలను నింపేయడం దేనికి సంకేతం?
- జనసేన అధినేత పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విశ్వ విద్యాలయాలు విద్యార్థులను సామాజిక, రాజకీయ, ప్రాపంచిక విషయాలపై చైతన్యవంతులను చేయాల్సి ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు ఆ బాధ్యతను విస్మరించి అధికార పార్టీ కార్యకర్తలను తయారుచేసే పనిలో ఉన్నాయా అనే సందేహం కలుగుతోందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ గురువారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. విశ్వ విద్యాలయాలను అధికార పార్టీ కార్యాలయాలుగా మార్పు చేసి, ముఖ్యమంత్రి ఫ్లెక్సీలతో ప్రాంగణాలు నింపేసిన తీరు విద్యార్థి లోకానికి, సమాజానికి ఏం సూచన ఇస్తోందని ప్రశ్నించారు. ఫ్లెక్సీల వల్ల పర్యావరణానికి ఎనలేని హాని కలుగుతుందని సందేశం ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పడానికి ఫ్లెక్సీలు కట్టడం విచిత్రంగా ఉందన్నారు. తొమ్మిది దశాబ్దాలపైబడి చరిత్ర కలిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చోటు చేసుకున్న పరిణామాలు ఏ మేరకు ఆమోదయోగ్యమైనవి? డా.సర్వేపల్లి రాధాకృష్ణన్, సి.ఆర్.రెడ్డి లాంటి గొప్పవారు ఉప కులపతులుగా బాధ్యతలు నిర్వర్తించిన సరస్వతి ప్రాంగణం ఆంధ్ర విశ్వవిద్యాలయం... ఆ విద్యా వనం నుంచి ఎందరో మేధావులు వచ్చారు... అలాంటి చోట చిల్లర రాజకీయాలు చేస్తూ, పార్టీ ఫ్లెక్సీలు కట్టించేవాళ్లు కీలక బాధ్యతల్లో ఉంటే ఎలాంటి ఫలితాలు వస్తాయో అందరూ ఆలోచించాలని అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోనూ ఇదే పోకడ కనిపిస్తోంది... ఉప కులపతులకు ఆ పార్టీపై ప్రత్యేక ప్రేమ, ముఖ్యమంత్రిపై అనురాగం ఉంటే వాటిని ఇంటికి పరిమితం చేసుకుని బాధ్యతలు నిర్వర్తించాలని మనవి చేస్తున్నాం... విశ్వ విద్యాలయాల ఖాతాల్లోని నిధులను ప్రభుత్వం మళ్లించుకోవడాన్ని నిలువరించి, విశ్వ విద్యాలయ అభివృద్ధి కోసం ఉప కులపతులు బాధ్యతగా పని చేయాలని పవన్ కళ్యాణ్ హితవు పలికారు.

శంకుస్థాపనలే తప్ప అభివృద్ధి శూన్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య

విశాలాంధ్ర-కడపరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మూడున్నరేళ్ల పాలనలో శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలు వేయడం తప్ప చేసిందేమీ లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మండిపడ్డారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఎన్నికలకు ఆరు నెలల ముందు శంకుస్థాపనలు చేస్తే మోసమన్న జగన్‌మోహన్ రెడ్డి... ఇప్పుడు మూడున్నరేళ్లుగా శంకుస్థాపనలు చేస్తూ తగిన నిధులు కేటాయించకుండా అభివృద్ధి పనులు అటకెక్కించడం దారుణం కాదా అని ప్రశ్నించారు. వైసీపీ అధికారంలోకొచ్చాక చెన్నూరు షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామన్న ఆయన మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి ఆ తర్వాత ఫ్యాక్టరీ ఊసెత్తడం లేదన్నారు. అక్కడ పనిచేస్తున్న కార్మికులు కట్టెలు కొట్టుకొని జీవనం సాగిస్తున్నారని చెప్పారు. శిలాఫలకం వేసిన దేవుని కడప చెరువు సుందరీకరణ పనులు ఏమయ్యాయని ప్రశ్నించారు. నిధులు లేక రిమ్స్ అభివృద్ధి పనులు నత్తడకన నడుస్తున్నాయన్నారు. ఆసియాలోనే పెద్ద ఆసుపత్రిగా పేరుగాంచిన రిమ్స్‌లో న్యూరాలజీ, కార్డియాలజీ విభాగాలకు దిక్కే లేదన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో సాధించింది ఏమిటో ప్రజలకు వివరించాలన్నారు. గాలేరు-నగరి రెండో దశ పనులకు గడచిన మూడు దశాబ్దాలలో ఎన్నో సార్లు శంకుస్థాపన జరిగిందని, మళ్లీ శంకుస్థాపన ఏంటని ప్రశ్నించారు. రైతులకు న్యాయం జరిగేలా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పుకుంటున్న వైసీపీ వాళ్లు... తీరా రైతులకు నష్టపరిహారం చెల్లించేటప్పుడు కాంగ్రెసోడా, తెలుగుదేశపోడా, కమ్యూనిస్టోడా అని వేరు చేసి రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి గడపగడపకు కాకుండా పొలం బాట పట్టాలని అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. హామీల్లో 98శాతం పూర్తి చేశామని చెప్పుకునే వారు సీఎం వస్తున్నారంటే 48 గంటల ముందే ప్రతిపక్ష నాయకులను ముందస్తు అరెస్టు చేయడం దేనికని ప్రశ్నించారు. రాయలసీమ గర్జన పేరుతో కర్నూలులో పెద్ద సభ ఏర్పాటు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే కార్యక్రమం మొదలెట్టారన్నారు. నిజానికి రాయలసీమ ప్రజలు వైసీపీకి 49 అసెంబ్లీ, 8పార్లమెంట్ స్థానాలను కట్టబెట్టారని, ఏ ఒక్క రోజైనా రాయలసీమకు రావలసిన ప్రత్యేక ప్యాకేజీ గురించి పార్లమెంటులో మాట్లాడిన పాపాన పోలేదన్నారు. కర్నూల్‌లో న్యాయ రాజధాని పెడితే ఎవరు అడ్డుకున్నారని ప్రశ్నించారు. రాష్ట్రానికి ఒక్క రాజధాని గతి లేదు కానీ మూడు రాజధానులు ఎలా కడతారని ప్రశ్నించారు. మద్యం, ఎర్రచందనం, ఇసుక, మైనింగ్, ప్రభుత్వ భూములు కబ్జాల ద్వారా అక్రమంగా కొల్లగట్టిన డబ్బులతో ఎన్నికల అక్రమాలకు సమాయత్తమవుతున్న దిగజారుడు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు అరాచకాలపై తిరగబడటానికి సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర, నగర కార్యదర్శి ఎస్. వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యులు బషిరున్నిసా, విజయలక్ష్మి, చంద్రశేఖర్, వేణుగోపాల్, గంగా సురేష్, జిల్లా సమితి సభ్యులు ఓబయ్య, పుష్పరాజ్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో బీజేపీ దోస్తీకి చంద్రబాబు ఆరాటం

- అందుకే తెలంగాణలో తంటాలు
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో బీజేపీతో దోస్తీ కోసమే తెలంగాణలో చంద్రబాబు తంటాలు పడుతున్నారంటూ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. వెలగపూడి సచివాలయం సమాచారశాఖ మీడియా పాయింట్ వద్ద సజ్జల గురువారం మాట్లాడారు. చంద్రబాబు ఏ రాష్ట్రంలో రాజకీయం చేయాలనుకుంటున్నారో తెలియడం లేదనీ, 2014లో తెలంగాణలో క్రియాశీలంగా ఉన్న చంద్రబాబు అకస్మాత్తుగా ఎందుకు మారిపోయారో... ఇప్పుడు మళ్లీ తెలంగాణలో మా పార్టీ ఉంది అని ఎందుకు చెప్పదలుచుకున్నాడో...ఎలాంటి ప్రయోగం చేయాలనుకుంటున్నారో ముందుగా ప్రజలకు చంద్రబాబు వివరించాలని డిమాండ్ చేశారు. ఆయనకు హైదరాబాద్‌లోనే ఇల్లుుంది... మొన్నటి వరకూ ఆయన ఓటు కూడా అక్కడే ఉందని గుర్తుచేశారు. ఆయన తెలంగాణ రాజకీయాల్లో ప్రజలకు సేవ చేయాలనుకుంటే మంచిదేననీ, కానీ ఎన్నికలు వస్తున్నందునే మళ్లీ తెలంగాణా వెళ్లి హడావుడి చేస్తున్నారన్నారు. గత ఎన్నికలను గమనిస్తే రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని, యూపీఏకు కన్వీనర్ కావాలనుకున్నారో ఏమో కానీ, దేశంలో చక్రం తిప్పుతానంటూ ఆయనతో తిరిగి చతికిలపడ్డారని ఎద్దేవా చేశారు. అసలు చంద్రబాబు ఎక్కడ ఉండాలనుకుంటున్నారో, ఏం చేయాలనుకుంటున్నారో స్పష్టత లేదన్నారు. సీఎం జగన్‌కు ఒక ఒక స్పష్టత ఉందనీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రానికి సేవ చేయాలనుకున్నారని పేర్కొన్నారు. అన్యాయంగా విభజన జరిగిందనీ, దీంతో ఆ తర్వాత ఏపీలో సేవ చేయాలని జగన్ నిర్ణయించుకున్నారని తెలిపారు. గతంలో కాంగ్రెస్‌తో చంద్రబాబు ప్రయోగం చేశారని, ఇప్పుడు ఏదోవిధంగా తెలంగాణలో తమతో బీజేపీ కలిస్తే...వారికే ప్రయోజనమనే భావన కలిగించే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తద్వారా తెలంగాణలో బీజేపీతో పొత్తు పెట్టుకుని, దాన్ని ఆంధ్రప్రదేశ్‌కు కూడా విస్తరించేలా చంద్రబాబు పావులు కదుపుతున్నారన్నారు. తన ప్రణాళికలో భాగంగానే చంద్రబాబు ఖమ్మంలో సభ పెట్టినట్లు ఉందని వివరించారు. తన ఈ ప్రతిపాదనకు బీజేపీని ఒప్పించేందుకు, ఆ పార్టీలోని తన మనుషుల ద్వారా శతవిధాలా చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు కూడా చంద్రబాబుది రెండు కళ్ల సిద్ధాంతమేనని, రాత్రికి ఒక మాట...పగలు ఒక మాట...ఒక్కో పార్టీ వద్ద ఒక్కో మాట మాట్లాడుతూనే ఉన్నారన్నారు. మొత్తానికి ఆంధ్రాలో మీరు మాతో పొత్తు పెట్టుకుంటే...బీజేపీకి తెలంగాణాలో ఉపయోగపడతామని బీజేపీతో చెప్పుకోడానికి, అక్కడి తన అనుచరులతో మద్దతు ఇప్పిస్తానని చెప్పుకోడానికే చంద్రబాబు సభ జరిపినట్లు ఉందంటూ సజ్జల వ్యాఖ్యానించారు. డీఎల్ రవీంద్రారెడ్డి వైసీపీలోనే ఉన్నానని ఇప్పుడెందుకు అనుకుంటున్నారో మాకు అర్థం కావడం లేదన్నారు. ట్యాబ్‌ల పంపిణీపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. ట్యాబ్‌ల విలువే రూ.500 నుంచి రూ.600 కోట్లు వరకు ఉంటుందని, కంటెంట్ ను బైజూస్ ఉచితంగా ఇస్తోందనీ, ఇది తెలియకుండా రూ.1400 కోట్ల అవినీతి అంటూ టీడీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. ప్రశాంతంగా ఉన్న పల్నాడును వల్లకాడు చేసేందుకు చంద్రబాబు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. ఉత్తరాంధ్ర పర్యటనకు వెళ్తున్న చంద్రబాబును అడ్డుకోవాల్సిన అవసరం మాకేం లేదంటూ సజ్జల అన్నారు.

ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు

- రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్
- విజయవాడ-గూడూరు సెక్షన్‌లో తనిఖీ

విశాలాంధ్ర-విజయవాడ: ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు అన్ని రైల్వేస్టేషన్‌లను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అన్నారు. డివిజన్‌లో వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం విజయవాడ- గూడూరు సెక్షన్‌లోని వివిధ స్టేషన్లను విస్తృతంగా తనిఖీ చేశారు. తొలుత కృష్ణా కెనాల్-తెనాలి సెక్షన్ మధ్య లెవెల్ క్రాసింగ్ (ఎల్‌సీ) నెం.306 నుంచి తనిఖీ చేసి గేట్ వద్ద భద్రతా అంశాలను పరిశీలించారు. తెనాలి స్టేషన్ మాస్టర్ గదిని తనిఖీ చేసి ప్యానెల్ బోర్డ్‌ను పరిశీలించారు. భద్రత విధివిధానాలపై స్టేషన్ మాస్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌పీఎఫ్ పోస్ట్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్స్ కార్యాలయాల సముదాయాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించారు. బాపట్ల రైల్వేస్టేషన్‌ను పరిశీలించి పర్యావరణాన్ని ప్రోత్సహించే దిశలో భాగంగా చెట్లు నాటారు. చీరాల స్టేషన్‌లో మూడో లైన్ పురోగతి పనులను పరిశీలించారు. చిన్నగంజాం-ఉప్పుగుండూరు సెక్షన్ మధ్య ప్రధాన బ్రిడ్జ్‌ను పరిశీలించి... ట్రాక్ వేగ సామర్థ్య పరీక్షను నిర్వహించారు. ఒంగోలు రైల్వే స్టేషన్‌లో రోలింగ్ స్టాక్ ఎగ్జామినేషన్ హట్‌ను, విజయవాడ స్టేషన్ ప్యాసింజర్స్ సౌకర్యాల యాప్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ యాప్‌ను వర్చువల్ విధానంలో ప్రారంభిం చారు. హెల్త్ యూనిట్‌ను సందర్శించి అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించి, హెల్త్ యూనిట్ ఆవరణలో మొక్కలు నాటారు. సింగరాయకొండ-ఉలవపాడు సెక్షన్ మధ్య కొత్తగా నిర్మించిన ఎల్‌సీ కమ్ రిలే రూమ్‌ను తనిఖీ చేశారు. బిట్రగుంట రైల్వే స్టేషన్ తనిఖీ చేసి క్యారేజీ, వాగన్ (సీ అండ్ డబ్ల్యూ) డిపో వద్ద బ్రేక్ పవర్ సర్టిఫికేషన్ కోసం 50 హెచ్‌పీ ఎయిర్ కంప్రెషర్ యూనిట్‌ను ప్రారంభిం చారు. నెల్లూరు స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన ఆర్‌పీఎఫ్ పోస్ట్‌ను ప్రారంభించారు. స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కార్యాలయ భవన సముదాయాన్ని పరిశీలించారు. జీఎం వెంట డీఆర్‌ఎం శివేంద్ర మోహన్, వివిధ శాఖల ప్రధాన అధికారులు, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

చంద్రమౌళి రెడ్డి అంత్యక్రియలకు సీఎం

విశాలాంధ్ర-జుపాడు బంగ్లా: టీటీడీ ఈవో ధర్మారెడ్డి కుమారుడు చంద్రమౌళి రెడ్డి (28) అంత్యక్రియలకు సీఎం జగన్ హాజరయ్యారు. అతడి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ధర్మారెడ్డి స్వగ్రామం నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామంలో గురు వారం చంద్రమౌళి రెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. గుండెపోటుకు గురై చెన్నై లోని కావేరి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచిన విషయం విధితమే. చంద్రమౌళిరెడ్డి మృతదేహాన్ని చెన్నై నుంచి రాత్రి పారుమంచాల తీసుకు రాగానే ఒక్కసారిగా ప్రజలు, బంధువులు కన్నీటిపర్యంతం అయ్యారు. కడసారి చూపు కోసం తిరుపతి, తమిళనాడు, ఉమ్మడి కర్నూలు జిల్లాల నుంచి నాయకులు, స్నేహితులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి ఘనంగా నివాళులర్పించారు. జగన్‌ను చూసి ధర్మారెడ్డి, అతడి భార్య, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అధైర్యపడొద్దని జగన్ వారిని ఓదార్చారు.

సంపాదకీయం

కరోనాకన్నా రాహులే ఎక్కువ ప్రమాదకారి?!

సెప్టెంబర్ ఏడున కన్యాకుమారి నుంచి ప్రారంభమైన రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఇంతవరకు తొమ్మిది రాష్ట్రాల గుండా సాగింది. వీటిలో బీజేపీ అధికారంలో ఉన్న కర్నాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలూ ఉన్నాయి. భారత్ జోడో యాత్ర ఏ రాష్ట్రంలో సాగినా ఆ రాష్ట్ర వ్యవహారాలను ప్రస్తావించడంతో పాటు మోదీ హయాంలో బీజేపీ అనుసరిస్తున్న విచ్ఛిన్నకర, విద్వేష పూరిత అంశాలనే రాహుల్ ప్రస్తావిస్తూ వచ్చారు. ఆయా రాష్ట్రాల నాయకుల నుంచి రాహుల్ కు ప్రశంసలూ వచ్చాయి. కొన్ని చోట్ల విమర్శలూ ఎదురయ్యాయి. మహారాష్ట్రలో ఈ యాత్ర సాగినప్పుడు రాహుల్ వీర సావర్కర్‌ను ప్రస్తావించడం సంఘ్ పరివార్ వారికి అభ్యంతరకరమైంది. ఇది సహజమే. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలగుండా యాత్ర సాగినప్పుడు అక్కడి అవినీతి ప్రస్తావనకు వచ్చింది. ఒక రకంగా ఆయన సైద్ధాంతిక పోరాటానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. దశాబ్దాల తరబడి కాంగ్రెస్ రాజకీయాలకు మూల ధాతువు అయిన సెక్యులరిజం పరిరక్షణనే ఆయన ఎక్కువగా ప్రస్తావించారు. ఈ యాత్ర దిల్లీ పొరుగు రాష్ట్రంలోకి ప్రవేశించేదాకా మోదీ ప్రభుత్వం ఈ యాత్రను పెద్దగా పట్టించుకోలేదు. అయితే అడపాదడపా బీజేపీ నాయకులు చౌకబారు విమర్శలు చేశారు. రాహుల్ టీ షర్ట్ 30–40 వేలు ఉంటుందని విమర్శించారు. కానీ మోదీ వేసుకునే ఒక సూటు ఖరీదు పది లక్షల రూపాయలని వీరికి తట్టనే లేదు. అద్దాలమేడలో కూర్చుని రాళ్లు విసరడం అంటే ఇదే. కాంగ్రెస్‌తో సంబంధం లేని అనేకమంది, సామాజిక కార్యకర్తలు ఎక్కడికక్కడ ఈ యాత్రలో భాగస్వాములు కావడం బీజేపీకి కంటగింపైంది. గుజరాత్ అభివృద్ధికి అడ్డుతగిలిన మేధాపాట్కర్‌తో కలిసి నడుస్తారా అని సాక్షాత్తు ప్రధానమంత్రే నిలదీశారు. ఈ మాట అన్నప్పుడు మోదీ నోట మంత్రంలా వినిపించే పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యంలాంటి మాటలు ఎందుకు గుర్తు రాలేదో! నిజానికి భారత్ జోడో యాత్ర ప్రభావం రాజకీయాలకు అతీతంగా చూడగలిగితే నేరుగా కేంద్ర ప్రభుత్వం చెప్పడానికి ఏమీఉండదు. కానీ ఈ యాత్ర శనివారం(డిసెంబర్ 24) దిల్లీలో ప్రవేశించనుండడం బీజేపీ వెన్నులో ఒణుకు పుట్టిస్తోంది. రాహుల్ యాత్రకు జనంనుంచి స్పందన ఉంది కానీ గోదీమీడియా పెద్దగా పట్టించుకోనేలేదు. యాత్ర దిల్లీ చేరినప్పుడు మాత్రం జాతీయమీడియా పట్టించుకోకుండా ఉండలేదు. అంతర్జాతీయ మీడియా ప్రతినిధులూ దిల్లీలోనే ఉంటారు. వారు మోదీకి అనుకూలురు కావచ్చు, వ్యతిరేకులూ కావచ్చు. కచ్చితంగా గోదీ మీడియాలో భాగం అయితే కాదు. రాహుల్‌యాత్ర దిల్లీలో ప్రవేశించక ముందే ఆపేయాలని కేంద్రప్రభుత్వం ఆలోచిస్తున్నట్టుంది. దీనికోసం కొత్తగా విజృంభిస్తున్న కరోనాను సాకుగా చూపిస్తున్నారు. చైనా, బ్రెజిల్, కొరియా, అమెరికా, జపాన్ లాంటి దేశాలలో ఈ విడత కరోనా ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. మనదేశంలో అంత పెద్ద ప్రమాదం ఏమీలేదని సీరం ఇన్‌స్టిట్యూట్ అధినేత అధర్ పూనావాలా, ఇతర నిపుణులు అంటున్నారు. మోదీ ప్రభుత్వం అసలు దృష్టి యాత్రను ఎలా ఆపాలన్నదే కనక కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్ సుఖ్ మాండవియా రాహుల్ గాంధీకి ఓ లేఖ రాశారు. దేశ శ్రేయస్సు దృష్ట్యా ఈ యాత్రను నిలిపివేయాలని కోరారు. ఇది పైకి కోరికలాగే ఉన్నా ఆదేశ స్వరమే వినిపిస్తోంది. కొత్తగా వ్యాపిస్తుందంటున్న కరోనా గురించి మాట్లాడవలసిన కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి నోరే మెదపలేదు. ఇదివరకు రెండు మూడు విడతల్లో కరోనా ఎదురైనప్పుడు సూచనలు, సలహాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించ వలసిన నియమాలు అన్నీ కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి నోటంటే వినే వాళ్లం. యాత్ర నిలిపివేయాలని మాండవియా రాహుల్‌కు లేఖ రాసే నాటికి తాజా విడత కరోనా భయంకరమైన స్థితిలో ఏమీ లేదు. కరోనాను కేంద్రం ఒక సాకుగా తీసుకుంది అంతే.

సైద్ధాంతికపోరాటంలో భాగంగా రాహుల్ సెక్యులరిజానికి కలుగుతున్న విఘాతం, రాజ్యాంగాన్ని విరూపం చేస్తున్న తీరును దుయ్య బట్టడం మోదీ సర్కారు గుండెల్లో గునపాలతో గుచ్చినట్టు అవుతోంది. రాహుల్ యాత్ర ప్రస్తుతం హర్యాణాలో ఉంది. కరోనా నిబంధనలను పాటించకపోతే ప్రమాదం అంటున్నారు మాండవీయ. ఈ ప్రమాదం కేవలం భారత్ జోడో యాత్రలో పాల్గొంటున్న వారి నుంచే ఉందా? కేవలం మూడుడోసులు టీకాలు తీయించుకున్న వారినే ఈ యాత్రలో అనుమతించాలని, యాత్రలో మొదటినుంచి పాల్గొంటున్న 120 మంది ఒకే చోట బస చేయకూడదని అంటున్నారు. మరి రాహుల్‌కు లేఖ రాసే సమయానికన్నా ముందో లేదా అదే సమయంలోనూ రాష్ట్రాలన్నింటినీ ఎందుకు హెచ్చరించలేదు. ఆరోగ్య శాఖ కార్యదర్శి రాజేశ్ భూషణ్ ఏం చేస్తున్నట్టు? ఆయన రాష్ట్రాలకు లేఖ రాశారు కానీ పాటించవలసిన నిబంధనల ప్రస్తావనే లేదు. అలాంటప్పుడు నిబంధనలు భారత్ జోడోయాత్రకు మాత్రమే వర్తింపచేయడంలో ఆంతర్యం సులభంగానే అర్థమవుతోంది. పార్లమెంటు సమావేశాలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఇందులోనూ కోవిడ్ జాగ్రత్తలు పాటించనేలేదు. పార్లమెంటు సమావేశాలు జరిగే సమయంలో ఆ ఆవరణలో సభ్యులు, వారి మంది, మార్బలం, సిబ్బంది, భద్రతా దళాలు, సందర్శకులు కలిసి కనీసం పదివేలమంది సంచరిస్తుంటారు. మరి అప్పుడు నిబంధనలు ఎందుకు గుర్తు రాలేదో! నిజానికి ఈ నిబంధనలను తొలగించి ఏడాది దాటింది. భారత్ జోడో యాత్ర దిల్లీ పొలిమేరల్లో ఉన్నప్పుడే ఇవన్నీ మోదీ సర్కారుకు గుర్తొచ్చాయి. ఇటీవలే హిమాచల్ ముఖ్యమంత్రి అయిన సుఖ్వీందర్ సింగ్ సుఖు హిమాచల్ ప్రదేశ్‌లో భారత్ జోడా యాత్రలో పాల్గొన్నందువల్లే ఆయనకు కరోనా సోకిందని మాండవీయ వింత తర్కానికి దిగారు. కొత్త కరోనా అంటున్న బి.ఎఫ్–7 ఆనవాళ్లు జులై, సెప్టెంబర్, నవంబర్ నెలల్లో గుజరాత్, ఒరిస్సా రాష్ట్రాలలో కనిపించాయి. పంజాబ్, దిల్లీ ముఖ్య మంత్రులు తాజా పరిస్థితిని సమీక్షించిన తరవాత ప్రధానమంత్రి మోదీ నింపాదిగా గురువారం సమీక్ష మొదలుపెట్టారు. గుజరాత్ శాసనసభ ఎన్నికలకుముందే ఈ ఛాయలుకనిపిస్తే మోదీ గుజరాత్ ఎన్నికలప్రచారంలో దాదాపు 15 రోజులు తలమునకలైనప్పుడు ఒక్క రోజూ కోవిడ్ నిబంధనలు పాటించనే లేదుగా. బెంగాల్ శాసనసభ ఎన్నికలు జరిగిన సందర్భంలో కరోనాభయం పీడిస్తూనే ఉన్నా మోదీ, షా తామే విధించిన నిబంధనలను తుంగలోతొక్కి భారీ ఎన్నికల ర్యాలీలు నిర్వహించారు గదా. ఆ సమయంలో రాహుల్‌గాంధీ స్వచ్ఛందంగా ర్యాలీలు ఉపసంహరించు కున్నారు. బిహార్‌లో ప్రశాంత్ భూషణ్ పాద యాత్రలకు, రాజస్థాన్, కర్నాటకలో బీజేపీ తలపెట్టిన ఆక్రోశ్‌యాత్రలకు కరోనా దూరంగాఉంటుందా? మోదీని కరోనాకన్నా రాహుల్‌భయంఎక్కువగా పీడిస్తున్నట్టుంది.

స్వేచ్ఛాజీవి

రా బావ ఏంటి చెడిపోయింది. నాశనమైపోయింది అంటూ వస్తున్నావు. ఏమైంది బావ ఈ రోజు నీకు... ఏం కావాలి బావ మనిషి బతుకు బానిస బతుకై పోయిందిగద. నిజమే బావ మనిషికి స్వేచ్ఛ అనేది ప్రాథమిక హక్కు ముఖ్యంగా ప్రజాస్వామ్య దేశంలో స్వేచ్ఛ అనేది అతి ముఖ్యమైనది. నిజమే బావ అది ఎక్కడుంది ప్రస్తుతం ఉన్నదల్లా మూక స్వామ్యమే గద. నిజమే బావ ఈ మధ్య సుప్రీంకోర్టు కూడా వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలుగకూడదని వ్యాఖ్యానించింది. మానవుడు సమాజంలో స్వేచ్ఛగా మనగలగాలి. కాని నేడు భావ స్వాతంత్ర్యం కోల్పోయి ప్రశ్నించడానికి భయపడి ఇంట్లో కూర్చుంటున్నారుగ బావ. నిజమే నెహ్రూ ప్రధానిగా ఉన్నకాలంలో ప్రతిపక్షనాయకులైన కృపలాని, సుందరయ్య, లోహియా లాంటి ఉద్దండులు పార్లమెంటులో ప్రభుత్వ నిర్ణయాలపై అభ్యంతరం వ్యక్తం చేసేవారు. చేసిన సూచనలు నెహ్రూ స్వీకరించేవాడు బావ. కానీ నేటి ప్రభుత్వాలు మాయచేసేదేమంటే ప్రతిపక్షం అనవసరం అంటున్నారు. అలాంటప్పుడు మనది ప్రజాస్వామ్య దేశం ఎలా అవుతుంది బావ నీవే చెప్పు. నిజమే బావ నీ ఆవేదనే విద్యాధికుల ఆవేదన కూడ. కాని బావ 38 శాతం ప్రజలెన్నుకున్న ప్రభుత్వం మిగతా 62 శాతం ప్రజలకు విలువివ్వడంలేదు బావ. అందుకే మన మేధావులు మనది మూక ప్రజాస్వామ్యం అన్నారు. నిజమే బావ ఎక్కడో ఎందుకు మా వార్డులో కొంతమంది చదువుమానేసి జులాయిగ తిరిగె కుర్ర గ్యాంగును స్థానిక శాసనసభ్యుడు వెంటేసుకుని తిరగడంతో మిగతా ప్రజలంతా వారికి భయపడవలసిన పరిస్థితి ఏర్పడింది. వారెన్ని తప్పులు చేసినా వారిపై పోలీసు కేసులుండవు. నిజమేబావ నాకు మనిషిగ బతకాలని ఉంది. కాని

నేటి రాజకీయాలలో అది సాధ్యం కాదు బావ. ఒక పార్టీలో ముఖ్య సభ్యునిగా ఉంటే చాలు వాడెన్ని తప్పులుచేసినా ఆ పార్టీ అధినాయకుడు కాపాడుతాడు. నిజమే బావ ఈ రోజుల్లో రాజకీయ నాయకుల తప్పులు బైటపెట్టి రోడ్డు మీద తిరగలేని పరిస్థితి. నిజమే మనిషికి, జంతువుకు తేడా ఉంది బావ. జంతువు ఆలోచించకుండా ముందున్న జంతువును అనుసరిస్తుంది. కాని మనిషి అలా కాదు బావ. మనిషికి ఆలోచించే శక్తి ఉంది. మంచి చెడులను బేరీజు వేసుకుని ముందుకు సాగుతాడు. నిజమే బావ అందుకే వావిలాల గోపాలకృష్ణయ్య ఏ పార్టీలో చేరలేదు. చేరితే తను నాయకుడ్ని గుడ్డిగా అనుసరించాలని ఆలోచించే అవసరం ఉండదని వ్యక్తిత్వం చంపుకోవాలని అలా చంపుకుంటే బానిస బతుకవుతుందని అనేవాడు బావ. నిజమే మేధావి మౌనంవహించి ఇంటికి పరిమితమైతే సమాజాభివృద్ధి కుంటుపడినట్టే. ఈ రోజు రోడ్డుమీద వీరంగంవేసే వాళ్లంతా మేధావులేగాని మేధావులు కాదు బావ. దారి చూపిస్తే ఆ దారివెంట నడిచే వారెగానీ దారి కనుగొనే వారు కాదు. నిజమే కోర్టులపై కూడా పెత్తనం చేయాలని రాజకీయ నాయకుల ఆలోచన. అలాంటప్పుడు న్యాయానికి దారేది బావ. రాజ్యమేలేవారు పీఠాధిపతులకు, దొంగ స్వాములకు మొక్కుతుంటే అదే అదనుగా భావించి వేలాదిఎకరాలు ఆ స్వాములు కాజేస్తున్నారు. నిజమే బావ ఈ పరిస్థితిలో స్వేచ్ఛ లేదని బాధపడటం అనవసరం.

జంతువుల వలే ఏమీ ఆలోచించకుండా వేళకు తిని నిద్రపోవడం తప్ప స్వేచ్ఛ గురించి ఆలోచించి లాభంలేదు బావ. చూస్తున్నావుగా బావ. నోట్లతో ఓట్లు కొని అధికార పీఠమెక్కి సంపాదించి మరల ఆ నోట్లతో ఓట్లు కొని అధికారం సంపాదిస్తున్నారు. ఇదొక చక్రభ్రమణం. మొన్న తెలంగాణలో ప్రజాప్రతినిధులను కొనే ప్రయత్నంచేసి బీజేపీ వారు అరెస్టయ్యారు. ఎటువంటివెరపు లేకుండా వ్యవహరిస్తున్నారు. నిజమే బావ మొన్నీమధ్య శాసనసభ్యుడొకడు అన్నాడు బావ. మేం గెలవడానికి కనీసం 30 నుంచి 50 కోట్లు ఖర్చు పెట్టాలని తిరిగి అంతకంటే ఎక్కువ సంపాదించడానికి ప్రయత్నించవలసి వస్తోందని అలా కాకుండా ఉండా లంటే వ్యవస్థ మారాలి అన్నాడు బావ. నిజమే బావ ప్రతివాడు ఈ వ్యవస్థ పూర్తిగా చెడిపోయిందని, వ్యవస్థ మారాలంటాడు గాని తాను మారడానికి ఏ మాత్రం ప్రయత్నించడు. ఇంకా వ్యవస్థ ఎలా మారుతుంది బావ. మనుషుల సముదాయమే వ్యవస్థ. మనిషి మారకుండా ఎలా అవుతుంది బావ. చివరకు ప్రధాని మోదీ కూడా అటువంటిస్వాముల చుట్టూ తిరుగుతూ తనమీద మచ్చపడకుండా వారి కోర్కెలు తీరుస్తుంటే మనిషి పరాధీనుడగ మారడంలో ఆశ్చర్యమేముంది బావ. నిజమే బావ యిదంతా చూసి ఆలోచిస్తే నక్సలిజంవైపు యువత మొగ్గుచూపడంలో ఆశ్చర్యమే ముంది. సమాజ మార్పు ఏ రకంగా సాధ్యమో అవగతం కాక యువత నక్సలైట్లుగా మారుతున్నారు. ఇంతగా ఆలోచించే మనకే ప్రత్యామ్నాయం కనపడటం లేదుగ బావ. కాని బావ ఎక్కడ దాగినా చివరకు గుహల్లో దాగినా కనిపెట్టే టెక్నాలజివచ్చిందని ఈ రోజుల్లో నమ్ముతున్న సిద్ధాంతానికి ప్రాణాలర్పించడమేగా బావ. స్వామీజీలకు కోట్ల ఆస్తులెందుకని ప్రశ్నించక పోగా వారికి ప్రజల ఆస్తులు దారాదత్తం చేయడం ప్రభుత్వాధిపతులకు ఎంతవరకు న్యాయం బావ. మూఢ నమ్మకాలకు బలైపోయే ప్రజలను మేల్కొలపకపోగా వాస్తుపేరిట ఉన్న బిల్డింగులను పడగొట్టి మరల కోట్ల రూపాయలతో పునర్నిర్మాణం చేస్తూ ప్రజలసొమ్ము వృధాచేస్తున్న ప్రభుత్వాలను ఏమనాలి బావ. ఏమీ అనలేం బావ. నేడు స్వేచ్ఛ లేదు. మానవుడు స్వేచ్ఛాయుత వాతావరణంలో బతకాలని కోరుకుంటే అది సాధ్యంకాదు ప్రజాస్వామ్య ముసుగులో అప్రజాస్వామ్య పాలన సాగుతున్న నేడు స్వేచ్ఛకోసం, ప్రశ్నించే హక్కు కోసం, భావప్రకటన స్వేచ్ఛ కోసం పోరాడవలసిన అవసరం ఎంతైనా ఉంది. అందుకోసం మేధావులు, రచయితలు, కళాకారులు ముందుకు వచ్చి రోడ్డెక్కాలి. ఇది మనిషిగా బతకడానికి అత్యవసరంగా గుర్తించాలి.

సెల్: 9885569394

రుణాల ఊబిలో భారత్!

నెహ్రూ నుండి మోదీ వరకు భారత ఆర్థికవ్యవస్థ స్వదేశీ, విదేశీ అప్పులపై ఆధారపడి కొనసాగుతున్నది. విదేశీ, స్వదేశీ అప్పు లేకుండా భారతదేశం మనుగడ సాధించలేని పరిస్థితుల్లో ఉంది. పాలకుల విధానాల ఫలితంగా తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించేందుకు తిరిగి అప్పులు చేయాల్సిన ఆర్థిక దుస్థితిలో దేశం కూరుకు పోయింది. స్వాతంత్ర్యం ప్రకటించినప్పుడు భారతదేశానికి వెయ్యికోట్ల స్టెర్లింగ్ నిల్వలు ఉన్నాయి. అవి హరించుకుపోయి విదేశాల నుంచి అప్పులు చేయటం ప్రారంభమై నేడు అప్పు చేయందే ప్రభుత్వాలు మనుగడ సాగించలేని స్థితికిచేరాయి. దేశ ఆదాయంలో విదేశీరుణం 1950-51లో కేవలం 0.3శాతం కాగా, 1967-68లో 19శాతం కంటే ఎక్కువగా ఉంది. పంచవర్ష ప్రణాళికల్లో సాధించిన అభివృద్ధి రేట్లలో అప్పులు, గ్రాంట్లు సాధించిన అభివృద్ధి రేటు ఎక్కువగా ఉంది. మొత్తం బడ్జెట్ లోటులో విదేశీసహాయం ద్వారా భర్తీ అయిన భాగం మొదటి పంచవర్ష ప్రణాళికలో 9.2శాతం కాగా, రెండవ పంచవర్ష ప్రణాళికలో 30శాతం, మూడవ ప్రణాళికలో 49.2శాతం, 1965-66లో 52.7శాతానికి పెరిగిందంటే విదేశీ రుణాలు దేశంలోకి ఎంతవేగంగా వస్తున్నది తెలుస్తోంది. 1970లో భారతదేశంలో తలసరి విదేశీ రుణభారం రూ.92.02 ఉంది. సామ్రాజ్యవాద, బడా పెట్టుబడిదారుల, బడా భూస్వామ్యవర్గ ప్రయోజనాలు కాపాడుతున్న ప్రభుత్వాల విధానాలతో 1950లో ప్రారంభమైన విదేశీ, స్వదేశీ అప్పులు అంజనేయ తోకవలే పెరుగుతూనే ఉన్నాయి. 1970 సెప్టెంబర్ చివరినాటికి వివిధ దేశాలు, ప్రపంచ బ్యాంక్ రూ.9,171.3కోట్ల రుణాలు, గ్రాంట్లు మంజూరు చేశాయి. అప్పటినుంచి దేశ, విదేశాల అప్పులు పెరుగుతూ 2014-15నాటికి దేశం నికర అప్పు 62,42,220.92 కోట్లు. 2020-21 నాటికి కేంద్ర ప్రభుత్వం మొత్తం అప్పు ఒక కోటి 18వేల 120 వందల కోట్లు. ఇది 2014 బడ్జెట్‌లో కేంద్రం అప్పు 55,18,120.15 కోట్లు. 2021-22 నాటికి 1,35,86,975.52 కోట్లకు చేరింది. ఇందులో విదేశాలనుంచి తీసుకున్న అప్పు 4,27,925.24కోట్లు.

1950-51లో దేశ అంతర్గత రుణం 2వేల కోట్లు కాగా, విదేశీరుణం 32కోట్లు. 2021-22లో అంతర్గత రుణం లక్ష కోట్లు కాగా, విదేశీరుణం 41లక్షల కోట్లు. ప్రస్తుత భారత ప్రభుత్వ అప్పు కోటి 55లక్షల కోట్లు. కేంద్ర ప్రభుత్వ అప్పు జీడీపీ 40శాతం, రాష్ట్రాల అప్పు మించగూడదు. రాష్ట్రాల జీడీపీలో వాటి అప్పు 20శాతం మించగూడదు. మోదీ ప్రభుత్వ పాలనలో 2014-21 సంవత్సరం మధ్య కాలంలో ఇంటర్నేషనల్ బ్యాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్ (ఐబీఆర్‌డీ), ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ అసోషియేషన్ (ఐడీఏ) ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కోఆపరేషన్ ద్వారా మోదీ ప్రభుత్వం 30,040 మిలియన్ డాలర్ల అప్పు తీసుకుంది. మోదీ ప్రభుత్వం చేసిన రుణ మొత్తమే అతి పెద్దది. గత కొద్ది నెలలుగా రాష్ట్రాల అప్పులు, ఉచిత పథకాలపై జరుగుతున్న చర్చ, మోదీ ప్రభుత్వ వైఖరి వెనుక అసలు విషయాన్ని "కాగ్" కుండ బద్దలు కొట్టింది. రాష్ట్రాల ఆర్థిక క్రమశిక్షణ పర్య వేక్షించాల్సిన కేంద్రప్రభుత్వం కూడా పరిమితికి మించి అప్పులు చేస్తున్నదని తెలిపింది. 2015-16 నుంచి 2019-20 కేంద్ర ఆర్థిక నిర్వహణ అత్యంత దారుణంగా ఉందని పేర్కొంది. 2015-16లో కేంద్రం అప్పు 5.5శాతం కాగా 2019-20 నాటికి 52.30 శాతానికి, 2022-23నాటికి 54శాతానికి పెరిగిపోతాయి. రాష్ట్రాల అప్పులు కూడా వాటి జీడీపీలో 20శాతానికి మించి 37శాతానికి చేరాయి.

కేంద్ర ప్రభుత్వానికి ఏడాది కాలంలో సమకూరుతున్న ఆదాయం మొత్తంలో 2019-20 సంవత్సరంలో అప్పులు, వడ్డీలకు చెల్లించింది 34శాతం కాగా, 2022-23 నాటికి 37శాతానికి పెరిగింది. 2016 నుంచి వడ్డీరేటు 6.91శాతం కాగా, 2020 నాటికి 6.61శాతం తగ్గినా చెల్లించాల్సిన వడ్డీ సొమ్ము పెరుగుతూ ఉందంటే అప్పు ఎలా పెరుగుతున్నది అర్థమౌతుంది. వడ్డీ రూపంలో కేంద్ర ప్రభుత్వం 2016లో 4.57 లక్షల కోట్లు చెల్లించగా, 2020నాటికి 6.55 లక్షల కోట్లకు చేరింది. అప్పులు, వాటికి చెల్లించే వడ్డీల పెరుగుదల జీడీపీ పెరుగుదల కంటే ఎక్కువ ఉండరాదన్నది ఆర్థిక సూత్రం. మోదీ ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. 2019-20 ఆర్థిక సంవత్సరం నాటికే జీడీపీ వృద్ధి రేటు 6.22శాతం కాగా, అప్పుల వడ్డీ రేటు 12.62శాతం ఉంది. దీన్ని గమనిస్తే జీడీపీ వృద్ధి రేటుకన్నా అప్పుల వడ్డీ రేటు రెట్టింపు అయ్యింది. 2015-2020 మధ్య కాలంలో మోదీ ప్రభుత్వం 105 లక్షల కోట్లు అప్పు చేసిందని "కాగ్" పేర్కొంది. 2018-19లో ద్రవ్యలోటు 1.88లక్షల కోట్లు ఉండగా, 2020-21 నాటికి 3.75 లక్షల కోట్లకు పెరగింది. 2021-22 సంవత్సరంలో అంతర్గత రుణం లక్ష కోట్లు, విదేశీ రుణం 41లక్షల కోట్లుగా ఉంది. తెచ్చిన అప్పులను సంపద సృష్టికి, ఆదాయం పెంచుకునేందుకు వినియోగించకుండా ఇష్టారాజ్యంగా ఖర్చు పెడుతున్నారని కాగ్ తప్పుపట్టింది. దేశం అప్పులకుప్పగా మారింది. గత నాలుగున్నర సంవత్సరాల్లో దేశ రుణభారం ఏకంగా 50శాతం పెరిగింది. కేంద్ర, రాష్ట్రాల అప్పులు గమనించినప్పుడు దేశం తాకట్టులో ఉందని అర్థమౌతున్నది. సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ దేశాల ఆర్థికసహాయం గురించి "ఎయిడ్ యాజ్ ఇంపీరియలిజం" అనే ఆసక్తికరమైన తన రచనలో తెలిసా హెయ్ టర్ అనే రచయిత్రి చెప్పారు. సహాయం అనేది సంక్లిష్టమైన మోసానికి చిహ్నం అని వర్ణించింది. ప్రపంచ బ్యాంక్ ఆర్థికసహాయం పొందుతున్న ఓవర్‌సీస్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేసిన కాలంలో తానుపొందిన అనుభవం నుంచి ఈ రచయిత్రి "వెనుకబడిన దేశాలకు చేస్తున్న ఈ సహాయం, ఆ దేశాల అభివృద్ధిని గిడసబార్చి వక్రమార్గాలు పెట్టిస్తున్నద'నే నిర్ణయానికి వచ్చింది.

లాటిన్ అమెరికాలో ఉండటం వలన సహాయం అనేది మూడవ ప్రపంచ ప్రజల సంక్షేమానికి వ్యతిరేకంగా ఉపకరించిందని నెమ్మదిగా గుర్తించానని, అర్ధవలస దేశాలపై తమ దోపిడీని కొనసాగించేందుకు వీలుగా సామ్రాజ్యవాదులకు ఇచ్చిన రాయితీగానే సహాయాన్ని పరిగణించవలసి ఉంటుందని ఆమె రచనలో పేర్కొంది. "సహాయం విదేశీ ప్రైవేట్ పెట్టుబడి నిరంతరం కొనసాగటం పైనే ఆధారపడి ఆ విధంగా సామ్రాజ్యవాదంతో ముడిపెట్టుకునే ఒక వర్గాన్ని మూడవ ప్రపంచదేశాల్లో సృష్టించుకొనటానికి, పెంచి పోషించటానికీ" ఈ విదేశీ సహాయం తోడ్పడుతుందని ఆమె చెప్పారు. అంతే కాకుండా ఈ సహాయం ఇచ్చేవారికి అనుకూలంగానూ, స్వీకరించేవారికి అననుకూలంగా ఉండే చర్యలు పొందుపర్చుకునేందుకు వీలు కలిగిస్తుంది. సహాయం పొందే దేశాల ప్రజలను మరింత పేదరికానికి గురిచేసే పథకాల కోసం ఆ సహాయాన్ని వినియోగించేలా చేస్తుంది. అది స్వీకరించే దేశాల రుణ భారాన్నిపెంచి సామ్రాజ్యవాద దేశాలపై పూర్తిగా ఆధారపడేట్లు చేస్తుందని తన గ్రంథంలో ఆమె వివరించారు.

లెనిన్ మహాశయుడు కూడా విదేశీ సహాయం గురించి ఇలా చెప్పారు. "వివిధ రూపాల్లో ప్రభుత్వ ప్రైవేట్ పెట్టుబడిని ఎగుమతి చేయటానికి సామ్రాజ్యవాదులు అనుసరించే పథకాల్లో అతిముఖ్యమైన వాటిల్లో సహాయం రూపంలో పెట్టుబడిని ఎగుమతి చేయటం ఒకటి. ఇది సామ్రాజ్యవాదులు అనుసరించే పెట్టుబడుల ఎగుమతుల రూపాలలో అతి తాజారూపం. మాజీ వలసదేశాల్లో తనపట్టు కొనసాగించటానికి వారికొక సాధనం. సరుకుల ఎగుమతికి బదులుగా పెట్టుబడి ఎగుమతి అత్యంత ప్రాముఖ్యత సంతరించుకొంటుంది. మూడవ ప్రపంచానికి చెందినదే భారతదేశం. దేశంనిండా అనేక సహజ వనరులు ఉన్నాయి. వీటిని దేశ ప్రయోజనాలకు, ప్రజల ప్రయోజనాలకు పాలకులు వినియోగించి ఉంటే దేశాభివృద్ధి జరిగి ఉండేది. కాని జాతీయోద్యమ కాలం నుంచి సామ్రాజ్యవాదంతో రాజీపడుతూ, వారుపెట్టిన షరతులకు ఆమోదం తెలుపుతూ దేశ వనరులను బహుళజాతి సంస్థలకు దేశ పాలకులందరూ కట్టబెడుతూ ఉండటంతో సిరిసంపదలతో విరాజిల్లాల్సిన భారతదేశం వెనకబడిన దేశంగా పేదరికంతో అప్పుల ఊబిలో కూరుకుపోయింది. సహజ వనరులను దేశాభివృద్ధికి ఉపయోగించే విధానాలు అమలుజరిపి, సామ్రాజ్యవాదుల దోపిడీనీ వ్యతిరేకించి, దానితో మిలాఖత్ అయిన దేశీయ బడా పెట్టుబడిదారుల, బడా భూస్వామ్య వర్గదోపిడీ అంతంచేసి, స్వతంత్ర పారిశ్రామిక విధానాన్ని అమలుజరిపి గ్రామీణ పేదలకు భూమి పంపిణీ చేయటం ద్వారా దేశం స్వయం సమృద్ధిచెంది అప్పులు చేయాల్సిన పరిస్థితులు తొలగిపోతుంది. అందుకోసం ప్రజలందరూ పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి.

బొల్లిముంత సాంబశివరావు, సెల్: 9885983526

కృష్ణ ఝా

అటవీచట్టం మార్పులతో విధ్వంసం

ప్రతి అభివృద్ధి చర్యలో అంతర్లీనంగా విధ్వంసం దాగి ఉంటుంది. మోదీ ప్రభుత్వం చేపట్టిన ప్రతిపాదిత మార్పులు నివాసితులను కుదేలు పరుస్తుంది. దీనికి ఉదాహరణ గ్లోబల్‌వార్మింగ్ (భూతాపం). పెరుగుతున్న భూతాపం, కాలుష్యం కారణంగా మనిషి మనుగడకే తీవ్ర ముప్పు ఏర్పడింది. శతాబ్దాలుగా మానవ నివాసాలకు ఆశ్రయమైన నదీ ప్రవాహాలతో కోత, అడవుల నరికివేత, పారిశ్రామికీకరణతో ఓజోన్ విధ్వంసం, భూకంపాలు వంటి పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయి. వ్యవసాయ భూమి కోసం అడవులను పెద్ద ఎత్తున నిర్మూలించడంతో ఉప్పెనలు, వరదలకు దారితీస్తోంది. ప్రపంచ ప్రఖ్యాత అమెజాన్ వంటి అడవులు నరికివేతతో పర్యావరణ పరిరక్షణకు తీవ్ర ముప్పు ఏర్పడుతోంది. మరోపక్క అడవులు కాల్చివేతలతో భూసారం క్షీణించి వాతావరణ కాలుష్యానికి దారితీసింది. ఫ్రెడరిక్ ఎంగెల్స్ తన డైలెక్టిక్స్ ఆఫ్ నేచర్ రచనలో ప్రకృతికి మనిషి చర్య విరుద్ధంగా ఉంటుందన్నారు. పంటల కోసం ప్రకృతిని ధ్వంసం చేస్తాడని పేర్కొన్నారు.

మనిషి చేపట్టే అన్ని చర్యలు దాదాపు ప్రణాళికా బద్ధంగా ఉంటాయి, కానీ జంతువులకు మాత్రం ప్రణాళిక ఉండదు. ఎంగెల్స్ మాటల్లో "...జంతువుల నివాసంతోనే ప్రకృతిలో మార్పులు వస్తాయి కానీ మనిషి పర్యావరణాన్ని తన స్వలాభం కోసం తన స్వీయ అవసరాలకు వినియోగిస్తాడు, తద్వారా పర్యావరణ నాశనానికి కారణమవుతున్నాడు. ఇది మనిషి, జంతువులకు మధ్య వ్యత్యాసం. ఈ వ్యత్యాసాన్ని తీసుకువచ్చేది శ్రమ అని పేర్కొన్నారు. ప్రకృతిపై మనిషి ఆధిపత్యం సాధిస్తాడు. అది కొనసాగిన కొలదీ ప్రకృతి మనిషిపై ప్రతీకారం తీర్చుకుంటుంది. మొదటిగా ప్రకృతి మనం ఊహించిన ఫలితాలను అందిస్తుంది. కానీ రెండు, మూడు దశల్లో ప్రకృతి ఊహించలేని ప్రతికూల ఫలితాన్ని చూపిస్తుంది. ప్రకృతి నియమాలను మనిషి ఆకళింపు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎంగెల్స్ నొక్కి చెప్పారు.

ప్రకృతిపై మనిషి చేపడుతున్న చర్యలు దీర్ఘకాలంలో తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రభావాల ఫలితం సమాజ దృక్పథంపై ఉంటుందని ఎంగెల్స్ పేర్కొన్నారు. పెట్టుబడిదారీ విధానానికి ముందున్న సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో దీర్ఘకాలిక పర్యావరణ ప్రభావాల గురించి ఆలోచించకుండా శ్రమ, ఉత్పత్తికి సంబంధించిన ఫలితాల గురించి మాత్రమే మనిషి ప్రధానంగా ఆందోళన చెందినట్లు పేర్కొన్నారు. రాజకీయ, ఆర్థిక, ఉత్పత్తి రంగాలలో మనిషి సాధించిన విజయాలపై సామాజిక

ప్రభావం ఉంటుంది. మనిషి తాను రూపొందించిన వస్తువుల ఉత్పత్తి, అమ్మకంపై మాత్రమే ప్రధానంగా కేంద్రీకరించడమైంది. క్యూబాలోని స్పానిష్ ప్లాంటర్‌ల ఉదాహరణను ఉటంకిస్తూ, పొలాలను కాల్చివేయడంతో కేవలం రాళ్ళు మాత్రమే మిగిలి ఉన్నాయని ఏంగెల్స్ పేర్కొన్నారు. "ప్రస్తుత ఉత్పత్తి విధానంలో తక్షణ ఫలితాలే ప్రధాన లక్ష్యంగా" పేర్కొన్నారు.

బ్రిటీష్ కాలంనాటి పెట్టుబడిదారీ సమాజంలో చోటుచేసుకున్న పర్యావరణ లొసుగుల గురించి కూడా మార్క్స్ వివరించారు. వాతావరణ కాలుష్యం గురించి ఆసక్తికరమైన వివరాలను అందించారు. పారిశ్రామికీకరణ, వ్యవసాయ ఉత్పత్తుల మధ్య బలమైన సంబంధాన్ని కలిగి ఉండటం అవసరమని ఎంగెల్స్‌తో వివిధ సందర్భాలలో చర్చించి నట్లుగా పేర్కొన్నారు. నిజానికి మార్క్స్, ఎంగెల్స్ సమాజాన్ని విశ్లేషించిన తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు. ప్రస్తుతం సమాజంలో నెలకొన్న వర్గ దోపిడీ వ్యవస్థకు ప్రధాన కారణం పెట్టుబడిదారీ వ్యవస్థగా పేర్కొన్నారు. సామాజిక-ఆర్థిక దోపిడీ వ్యవస్థలో మార్పును కోరుతూ అణగారినవర్గాలను శాస్త్రీయంగా నిర్వహించే బ్లూ ప్రింట్‌ను సిద్ధంచేసింది మార్క్స్, ఎంగెల్స్ ద్వయం.

పారిశ్రామికీకరణతో పర్యావరణం తీవ్ర ప్రమాదాలను ఎదుర్కొంటోందని మార్క్స్, ఎంగెల్స్ పేర్కొన్నారు. వారి ప్రవచనాలన్నీ నిజమయ్యాయి. పర్యావరణ కాలుష్యంతో సునామీ, భూకంపాలు, కరువులు, భారీ వరదలు సాధారణమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా పతి నిమిషం అడవులు కాల్చివేతలకు గురవుతున్నాయి. తద్వారా విషవాయువులు వ్యాపించడంతో అంటు వ్యాధులకు కారణమవుతున్నాయి. వాతావరణాన్ని విషపూరితం చేస్తున్నాయి. తత్ఫలితంగా కరోనా మహమ్మారి వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ విధ్వంసాలన్నీ అభివృద్ధి నిరోధకాలే. ప్రాథమికంగా పర్యావరణ సమస్యలను చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది. పర్యావరణం, ప్రకృతికి కలిగించే ముప్పు మనిషి ప్రాణాలకు ముప్పుగా పరిణమించింది. మన పర్యావరణం రాజకీయ, కార్పొరేట్ల స్వార్థప్రయోజనాలకు ఉపయోగపడే మార్గాలవైపు మళ్లింది. దీనికి ఉదాహరణ తాజాగా అమలైన అటవీ భూముల విక్రయం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రకృతికి అవసరమైన సమతుల్యతను తిరిగి తీసుకురావడానికి బదులుగా, అటవీభూమిని డి-రిజర్వేషన్ చేయడానికి, అటవీయేతర ప్రయోజనాలకోసం దానిని ఉపయోగించ డానికి చట్టాల్లో సవరణలు తీసుకువచ్చారు. అటవీ (సంరక్షణ) నియమాలు, 2022లో తీసుకురావాల్సిన మార్పులు అటవీ నివాసులను నిర్వాసితులను చేస్తాయి. దీని ప్రభావం అడవులలో నివసించే ప్రజలపై మాత్రమే కాకుండా పర్యావరణంపై కూడా ప్రభావం చూపుతుంది.

'ఉపాధి'పై ఉదాసీనత

రాష్ట్రాలకు నిధులివ్వని కేంద్రం

కార్మికులకు అందని వేతనాలు

రూ.4వేల కోట్లకు పైగా బకాయిలు

న్యూఢిల్లీ: పేదలకు ఉపాధి కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) అమలులో కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. సకాలంలో కేంద్రం నిధులు విడుదల చేయకపోవడంతో రాష్ట్రాలు పనులు చేసిన కార్మికులకు వేతనాలు చెల్లించడంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. ఈ విధంగా ఏడాది పాటు జాప్యం జరిగిన రాష్ట్రాల జాబితాలో పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్ ముందు వరుసలో ఉన్నాయి. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ స్వయంగా రాజ్యసభకు సమాచారం వెల్లడించింది. తృణమూల్ కాంగ్రెస్ అధికారంలో ఉన్న పశ్చిమ బెంగాల్‌లో నైతే పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. వేతనాల చెల్లింపులో జాప్యం కారణంగా పథకం పరిధి నుంచి బయటపడుతున్న వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని (2022-23)కి రాష్ట్రానికి రూ. 833 కోట్లు, 2021-22కి రూ. 1,916 కోట్ల ఉపాధి హామీ నిధులు కేంద్రం నుంచి రావాల్సి ఉంది. బెంగాల్ తర్వాత యూపీకి రూ.318 కోట్లు, బీహార్‌కు రూ.301 కోట్లు, జార్ఖండ్‌కు రూ.276 కోట్ల ఉపాధి నిధులు కేంద్రం నుంచి రావాల్సి ఉంది. మొత్తంగా 34 రాష్ట్రాలలో చూసినట్లయితే రూ.4,919 కోట్ల మేర ఉపాధి నిధులు కేంద్రం విడుదల చేయాల్సి ఉంది. మెటీరియల్ (ఉదాహరణకు, ఇటుకలు, సిమెంట్ మొదలైనవి) పరంగా కూడా గరిష్ఠంగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్రాలలో పశ్చిమ బెంగాల్ అగ్రస్థానంలో ఉంది. ఇందులో రాష్ట్రాలు25 శాతం ఖర్చును భరించవలసి ఉంటుంది, మిగిలిన 75శాతం కేంద్రం విడుదల చేస్తుంది. ఈ ఏడాది డిసెంబర్ 16 నాటికి రాష్ట్రానికి రూ. 467 కోట్లు రావాల్సి ఉండగా, 2021-22కి సంబంధించి రూ. 2,221 కోట్లు కేంద్రం నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. బెంగాల్ తర్వాత ఈ తరహా కేంద్ర నుంచి బకాయిలు రావాల్సిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రూ.706 కోట్లు, కర్ణాటక రూ.346 కోట్లు, మధ్యప్రదేశ్ రూ.299 కోట్లు, బీహార్ రూ.226 కోట్లు, రాజస్థాన్ రూ.202 కోట్లు, తెలంగాణ రూ.182 కోట్లు ఉన్నాయి. ఈ రూపేణా 2022-23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.5,485 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఎంజీఎన్ఆర్ఈజీఏ అనేది డిమాండ్-ఆధారిత వేతన ఉపాధి పథకం... ఇది గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి ఏడాదికి 100 రోజుల నైపుణ్యేతర పనికి హామీ ఇస్తుంది. కరోనా సమయంల్లో ఈ పథకం కింద పని కోసం డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఉద్యోగాలు కోల్పోయిన లక్షలాది మందికి ఈ పథకం కొద్దో గొప్పో ఆసరాగా నిలిచింది. నిధులు విడుదల చేయడానికి ముందు రాష్ట్రాల్లో కేంద్ర పథకాల పురోగతిని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సమీక్షిస్తుంది. కాగా కేంద్రం తీసుకుంటున్న కొన్ని చర్యలతో చెల్లింపులు నిలిచిపోతున్నాయి. అవినీతి ఆరోపణలొచ్చిన రాష్ట్రాలకు చెల్లింపులు నిలిపివేసి తనిఖీకి బృందాలను కూడా పంపింది. అవినీతిపరులపై చర్యలు తీసుకోవాల్సిందే కానీ శ్రమ చేసినవారికి వేతనం నిలిపివేయడం వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. సమస్యలు ఉన్నప్పటికీ కార్మికులకు చెల్లించాల్సిన వేతనాల కోసం నిధులను విడుదల చేయాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించినప్పటికీ పట్టించుకోవడంలేదు. ఎంజీఎన్ఆర్ఈజీఏ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎంఐఎస్) నుండి వచ్చిన డేటా ఏం చెబుతోందంటే... పని అడిగిన వారి సంఖ్య ఈ ఆర్థిక సంవత్సరంలో రెండింతలు పెరిగింది. అయితే జనవరిలో 7 శాతంగా ఉన్న పనిని తిరస్కరించిన వారి సంఖ్య ఈ ఏడాది నవంబర్ నాటికి 14 శాతానికి పెరిగింది.

భారత్‌లో లాక్‌డౌన్ పరిస్థితి రాదు: ఐఎంఏ

న్యూఢిల్లీ: అనేక దేశాల్లో కొవిడ్ విజృంభిస్తోన్న నేపథ్యంలో.. భారత్ సైతం అప్రమత్తమైన విషయం తెలిసిందే. అయితే, అధిక వ్యాప్తి సామర్థ్యంగల ఒమిక్రాన్ ఉపరకం బీఎఫ్.7 కేసులు భారత్‌లోనూ వెలుగు చూసిన నేపథ్యంలో.. తాజా పరిణామాలు మరో వేవ్‌కు దారితీసి, దేశాన్ని మళ్లీ లాక్‌డౌన్‌లోకి నెడతాయా? అన్న కలవరం నెలకొంది. ఈ తరుణంలో భారత వైద్య సంఘానికి చెందిన డా.అనిల్ గోయల్ కీలక ప్రకటన చేశారు. ఇప్పటికే దేశ జనాభాలో అర్హులైనవారిలో 95 శాతం మందికి వాక్సినేషన్ పూర్తయిన నేపథ్యంలో, లాక్‌డౌన్ వంటి పరిస్థితి రాదని ఆయన ఓ వార్తాసంస్థ ఇంటర్వ్యూలో చెప్పారు. భారతీయుల రోగనిరోధక శక్తి చైనీయుల కంటే అధికంగా ఉందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ తప్పనిసరిగా మళ్లీ 'టెస్టింగ్, ట్రీటింగ్, ట్రేసింగ్' విధానానికి మారాలని డా॥ గోయల్ ఈ సందర్భంగా సూచించారు. 'ఇప్పటికే భారత్ 200 కోట్లకుపైగా డోసులు అందించింది. ఈ నేపథ్యంలో లాక్‌డౌన్ వంటి పరిస్థితి తలెత్తదు' అని చెప్పారు. మరోవైపు.. పౌరులంతా తప్పనిసరిగా కొవిడ్ నిబంధనలు పాటించాలని ఐఎంఏ విజ్ఞప్తి చేసింది. బహిరంగ ప్రదేశాల్లో మాస్కుల వినియోగం, శానిటైజర్ల వాడకం, వ్యక్తిగత దూరం పాటించడం వంటి కొవిడ్ నిబంధనలతో వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపింది. ప్రపంచ దేశాల్లో కొత్త కేసులు పెరుగుతున్న వేళ అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని కేంద్రమంత్రి మన్‌సుఖ్‌మాండవీయ ఇప్పటికే ఆదేశించారు.

వాట్సాప్ సమాచారం తప్పు

న్యూఢిల్లీ: చైనాతోపాటు ఇతర దేశాల్లో కరోనా కొత్త వేరియంట్ విజృంభిస్తోన్న వేళ.. భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. చైనాలో విస్తృత వ్యాప్తికి కారణమైన బీఎఫ్7 వేరియంట్ విస్తృతంగా వ్యాపిస్తోన్న నేపథ్యంలో వైరస్‌పై పర్యవేక్షణ పెంచడంతోపాటు జీనోమ్ సీక్వెన్సింగ్ చేపట్టాలని రాష్ట్రాలకు సూచించింది. ఇలా కోవిడ్ వ్యాప్తిపై మరోసారి ఆందోళనలు నెలకొన్న సమయంలో.. భారత్‌లో అత్యంత ప్రమాదకరమైన ఎక్స్‌బీబీ వేరియంట్ వ్యాపిస్తోందనే వార్తలు వాట్సాప్‌లో చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై స్పందించిన కేంద్ర ఆరోగ్యశాఖ, అది తప్పుదోవ పట్టించే సమాచారమని స్పష్టం చేస్తూ ఓ ప్రకటన జారీ చేసింది. 'ఒమిక్రాన్ ఉపరకమైన ఎక్స్‌బీబీ వేరియంట్ కొత్తగా వెలుగు చూసింది. డెల్టా వేరియంట్ కంటే ఐదు రెట్ల ఎక్కువ వ్యాప్తితోపాటు మరణాల రేటు కూడా అధికంగా ఉంటుంది. ఇతర వేరియంట్లతో పోలిస్తే దీని వల్ల కలిగే లక్షణాలు కూడా వేరుగా ఉంటాయి. దగ్గు, జ్వరం కాకుండా ఇతర లక్షణాలు ఉంటాయి. ఈ విషయాన్ని కుటుంబీకులు, మిత్రులకు తెలియజేయండి' అంటూ ఓ సమాచారం వాట్సాప్ గ్రూపుల్లో విస్తృతంగా తిరుగుతోంది. ఈ సమాచారం నకిలీదని, తప్పుదోవపట్టించేదని కేంద్ర ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది. మరోవైపు ఒమిక్రాన్ కంటే ఎక్స్‌బీబీ వేరియంట్ ప్రమాదకరమైనది అనడానికి ఎటువంటి సమాచారం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇదివరకే పేర్కొంది. డెల్టా వేరియంట్ కంటే తక్కువ ప్రమాద తీవ్రత ఉంటుందని తెలిపింది. ఒమిక్రాన్ వేరియంట్లతో పోలిస్తే దీని వ్యాప్తి వేగంగా ఉన్నప్పటికీ తీవ్రత మాత్రం తక్కువేనని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మెట్రిక్స్, ఎవాల్యూయేషన్ నివేదిక కూడా వెల్లడించింది. ఏదేమైనా ప్రస్తుతం చైనాలో విజృంభణకు బీఎఫ్7 వేరియంట్ కారణమని ఈఎక్స్‌బీబీ కాదన్న విషయాన్ని గుర్తించాలని నిపుణులు సూచిస్తున్నారు.

విమానాశ్రయాల్లో కరోనా పరీక్షలు

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో కరోనా కేసులు విజృంభిస్తున్నాయి. దేశంలో కూడా ఒమిక్రాన్ కొత్త వేరియంట్ బీఎఫ్7 కేసులు వెలుగుచూడటంతో కేంద్ర ఆరోగ్య శాఖ గురువారం నుంచి దేశంలోని అన్ని విమానాశ్రయాల్లోనూ కరోనా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల నుంచి రాండమ్‌గా నమూనాలను సేకరించి వాటిని జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపేలా ఏర్పాట్లు చేయాలని పేర్కొంది. బెంగళూరు సహా దేశంలోని అన్ని విమానాశ్రయాల్లోనూ ఇప్పటికే స్క్రీనింగ్ టెస్టులు ప్రారంభమయ్యాయి. రద్దీగా ఉండే ప్రదేశాలతో పాటు విమానాశ్రయాల్లోనూ మాస్కులు ధరించాలని కేంద్రం ఆదేశించింది. అయితే కరోనా కొత్త వేరియంట్‌తో భయపడాల్సిన పనిలేదని సీరం ఇన్‌స్టిట్యూట్ సీఈఓ అదర్ పూనావాలా పేర్కొన్న సంగతి తెలిసిందే. కేంద్రం సూచించిన విధంగా కరోనా జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. ప్రతివారం కరోనా సమీక్ష సమావేశాలు నిర్వహించి పరిస్థితిని నిశితంగా గమనిస్తామని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ పేర్కొన్నారు.

దళిత యువకుడిపై దాడి

గాంధీనగర్: అగ్రకులానికి చెందిన యువతితో మాట్లాడినందుకు ఓ దళిత వ్యక్తిపై దాడి చేసిన ఘటన గుజరాత్‌లో జరిగింది. డిసెంబర్ 11న జరిగిన ఈ దాడి ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో.. వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనపై విచారణ చేపట్టామని, నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం.. అల్పేష్ పర్మర్ (24) డిసెంబర్ 11వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో స్నేహితురాలితో మాట్లాడుతుండగా.. ఏడుగురు వ్యక్తులు అక్కడికి వచ్చారు. తమ వీడియోలపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ అల్పేష్‌తో వాగ్వివాదానికి దిగారు. కులం పేరుతో దూషిస్తూ.. బెల్టులతో దాడిచేశారు. నడిరోడ్డుపై కాలితో తన్నారు. పోలీసులకు సమాచారమిస్తే చంపేస్తామని బెదిరించారు. అతని కాళ్లు, వీపు, చేతులపై తీవ్ర గాయాలవడంతో కుటుంబసభ్యుల ఒత్తిడితో బాధితుడు ఫిర్యాదు చేసినట్లు వడోదర సూపరింటెండెంట్ తెలిపారు. ఈ ఘటనపై వద్గామ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే జిగేష్ మేవాని గురువారం ఘాటుగా స్పందించారు. ఉనా ఘటన జరిగినపుడు ప్రధాని మోదీ 'కావాలంటే నన్ను చంపండి.. కానీ నా దళిత సోదరులకు హాని చేయవద్దు" అని పేర్కొన్నారని కానీ.. దళితులపై దాడి ఘటనలు పునరావృతమవుతున్నా.. రాష్ట్ర అధికార యంత్రాంగం స్పందించడం లేదని ట్విటర్‌లో పేర్కొన్నారు. ఇటీవల వడోదరలో ఓ దళిత యువకుడిని బహిరంగంగా చావుదెబ్బలు కొట్టారన్నారు.

ఆర్ఐఎల్ చేతికి మెట్రో ఇండియా



న్యూఢిల్లీ: దేశీయ రిటైల్ రంగ వ్యాపారం మరింత బలోపేతం అయ్యే దిశగా ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ మరో ముందడుగు వేసింది. జర్మనీ సంస్థ మెట్రో ఏజీ భారత్‌లో 'మెట్రో క్యాష్ అండ్ క్యారీ ఇండియా నిర్వహిస్తున్న టోకు వ్యాపారాన్ని ఆర్ఐఎల్ చేజిక్కించుకుంది. ఈ కొనుగోలు విలువ రూ.2,850 కోట్లు. పూర్తిగా నగదు రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు రెండు సంస్థల మధ్య నిశ్చయాత్మక ఒప్పందం కుదిరింది. మెట్రో ఇండియా 2003లో భారత మార్కెట్లోకి ప్రవేశించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 21 నగరాల్లో 31 హోల్‌సేల్ పంపిణీ కేంద్రాలున్నాయి. 3,500 మంది ఉద్యోగులు ఉన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న రిటైలర్లు వంటి బిజినెస్ కస్టమర్లతో ఈ సంస్థ వ్యాపారం నిర్వహిస్తోంది. 'క్యాష్-అండ్-క్యారీ' వ్యాపార నమూనాతో భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన తొలి కంపెనీ ఇదే. దాదాపు 3 మిలియన్ల కస్టమర్లకు సేవలందించింది. దీంట్లో 1 మిలియన్ కస్టమర్లు తరచూ మెట్రోతో కొనుగోళ్లు చేస్తున్నారు. 2022 సెప్టెంబరుతో ముగిసిన ఏడాది వ్యవధిలో ఈ కంపెనీ రూ.7,700 కోట్లు విలువ చేసే విక్రయాలు జరిపింది. భారత్‌లోకి ప్రవేశించిన తర్వాత మెట్రోకు ఇదే మెరుగైన రికార్డు. చిరు వ్యాపారులు, సంస్థల సహకారంతో వినియోగదారులకు చేరువవ్వాలనే తమ వ్యాపార నమూనాలో భాగంగానే మెట్రో ఇండియాను కొనుగోలు చేసినట్లు రిలయన్స్ రిటైల్ వెంచర్స్ డైరెక్టర్ ఇశా అంబానీ తెలిపారు. భారత బీ2బీ మార్కెట్‌లో మెట్రో పటిష్ఠమైన బహుళ-ఛానెల్ ప్లాట్‌ఫారమ్‌ను నిర్మించిందన్నారు. భారత కిరాణా మార్కెట్‌పై రిలయన్స్‌కున్న లోతైన అవగాహనకు మెట్రో నెట్‌వర్క్ జత కలిస్తే దేశంలో చిరు వ్యాపారులకు ప్రత్యేకమైన లబ్ధి చేకూరుతుందని తెలిపారు.

బీహార్‌ను కించపరిచే ఉద్దేశం లేదు: గోయల్

న్యూఢిల్లీ: బీహార్‌ను, ఆ రాష్ట్ర ప్రజలను కించపరిచే ఉద్దేశం తనకు లేదని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఈ మేరకు గురువారం రాజ్యసభలో ఆయన ప్రకటన చేశారు. ఆర్జేడీ నేత మనోజ్ ఝాకు సమాధానమిస్తూ కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ బీహార్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు. తనకు బీహార్ ప్రజలను కించపరిచే ఉద్దేశం లేదని చెప్పారు. రాజ్యసభ కార్యకలాపాలు ప్రారంభమైన వెంటనే సభా నాయకుడిగా ఉన్న కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ... 'బీహార్ ను గానీ, బీహార్ ప్రజలను గానీ అవమానించే ఉద్దేశం నాకు లేదని స్పష్టం చేస్తున్నాను. ఒకవేళ నా మాటలు ఎవరినైనా బాధపెట్టినట్లయితే వెంటనే వాటిని ఉపసంహరించుకుంటాను. ఎవరినీ కించపర్చడానికి నేను ఆ మాటలు అనలేదు' అని ఆయన అన్నారు. అదనపు ఖర్చులకు పార్లమెంటు ఆమోదం కోరుతూ ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా మంగళవారం ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా మాట్లాడుతూ... పేదలు, కార్పొరేట్ సంస్థలపై ప్రభుత్వం సమాన శ్రద్ధ చూపాలని కేంద్రానికి చురక అంటించారు. దీనిపై గోయల్ స్పందిస్తూ 'ఇస్కా బాస్ చలే తో దేశ్ కో బీహార్ బనా దే (వారి ఇష్టానుసారం జరిగితే దేశం మొత్తం బీహార్ అవుతుంది)' అని అన్నారు. దీనిపై గోయల్ వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.

బీజేపీతో లింగాయత్‌ల ఢీ

రిజర్వేషన్లు కల్పించకపోతే పతనమేనని హెచ్చరిక

రెండు లక్షల మంది భారీ ప్రదర్శన

బెంగళూరు: కర్ణాటకలో అధికార బీజేపీకి భారీ ఓటు బ్యాంకుగా ఉన్న పంచమసాలి లింగాయత్‌లు నిరసన గళం వినిపిస్తున్నారు. ప్రభుత్వోద్యోగాలు, విద్యావకాశాల్లో తమకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. బెళగావిలోని సువర్ణ విధాన సౌధకు ప్రదర్శనగా వెళ్లారు. తమకు రిజర్వేషన్లు కల్పించకపోవడం వల్లే యడియూరప్ప ప్రభుత్వం పతనమైందని బసవరాజ్ బొమ్మై నేతృత్వంలోని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పంచమసాలి లింగాయత్‌లు మృత్యునయ స్వామి సారథ్యంలో పాదయాత్రగా బయల్దేరి బెళగావిలోని సువర్ణ విధాన సౌధకు చేరుకున్నారు. దాదాపు 2 లక్షల మంది ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నట్లు నిర్వాహకులు చెప్పారు. మృత్యునయ స్వామి మీడియాతో మాట్లాడుతూ కర్ణాటకలో తమ జనాభా 1.3 కోట్లు అని తెలిపారు. లింగాయత్‌లలో తాము పెద్దసంఖ్యలో ఉన్నామన్నారు. బీజేపీ ఓటు బ్యాంకులో తమది 80 శాతం ఉందన్నారు. బొమ్మై ప్రభుత్వంలో 22 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, నలుగురు ఎమ్మెల్సీలు ఉన్నారన్నారు. యడియూరప్ప ప్రభుత్వం తమకు రిజర్వేషన్లు ఇవ్వలేదని, అందుకే పతనమైందని చెప్పారు. తమకు రిజర్వేషన్లు కల్పిస్తామని ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ప్రభుత్వం తమకు హామీ ఇస్తున్నప్పటికీ, అమలు చేయడం లేదని ఆరోపించారు. అందుకే తాము నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బొమ్మై ప్రభుత్వం తమ డిమాండ్‌ను ఆమోదించకపోతే 2023 ఎన్నికల్లో ఫలితాలు కనిపిస్తాయని హెచ్చరించారు. లింగాయత్‌లకు రిజర్వేషన్లు ఇచ్చే బాధ్యత బసవరాజ్ బొమ్మై ప్రభుత్వంపైనే ఉందన్నారు. ఈ అంశంపై తీసుకునే నిర్ణయం ప్రభావం నూటికి నూరు శాతం 2023 ఎన్నికల్లో కనిపిస్తుందన్నారు. తమది వెనుకబడిన కులమని, అందువల్ల విద్య, ప్రభుత్వోద్యోగాల్లో రిజర్వేషన్లు అవసరమని తెలిపారు. ఇదిలావుండగా, ఈ సమస్యపై చర్చించేందుకు బొమ్మై గురువారం కేబినెట్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో బీజేపీ ఎమ్మెల్యేలు సహా నేతలు కూడా పాల్గొన్నారు. తమ ప్రభుత్వం పంచమసాలి లింగాయత్‌లకు రిజర్వేషన్లు కల్పిస్తుందని 100 శాతం నమ్మకం ఉందని చెబుతున్నారు.

కార్మికుల కోసం పోరాడితే హింసిస్తారా!

హరియాణా పోలీసులపై కోర్టు మండిపాటు

న్యూఢిల్లీ: దళిత, కార్మిక హక్కుల కార్యకర్త శివ కుమార్ అక్రమ నిర్బంధం, కస్టడీలో చిత్రహింసలకు గురిచేయడంపై విచారణ కమిటీ తమ నివేదికను పంజాబ్, హరియాణా హైకోర్టుకు సమర్పించింది. గతేడాది మార్చి 16న ఫరీదాబాద్ జిల్లా సెషన్స్ జడ్జి నేతృత్వంలో విచారణ కమిటీని నియమించింది. కార్మిక హక్కుల కోసం పోరాడిన ఓ వ్యక్తిని క్రూరంగా, దారుణంగా హింసించడం సమంజసం కాదని కోర్టు పేర్కొంది. సోనెపట్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి, జైలు అధికారులు విధుల నిర్వహణలో విఫలమయ్యారని హరియాణా పోలీసులు తెలిపారు. పోలీసులు శివకుమార్‌ను క్రూరంగా చిత్రహింసలకు గురిచేశారని ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఆస్పత్రి (జీఎంసీహెచ్) ఆ నివేదికలో పేర్కొంది. పోలీస్ అధికారుల ఆదేశాలకనుగుణంగా వైద్యులు వ్యవహరించారని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించారని పేర్కొంది. న్యాయవిచారణలో 15 మంది సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేశారు. చమర్ కులానికి చెందిన వాడంటూ శివకుమార్‌ను దూషించడం, మరుగుదొడ్లు శుభ్రం చేయించడం, అతనిపై ఉమ్మివేయడం, చేతులు, కాళ్లను మరిగే వేడి నీటిలో ఉంచడం, ముఖంపై వాటర్ కెనాన్‌ను ఉంచడం, అతనిపై కుర్చీ వేసి దానిపై సీఐఏ(క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ) సిబ్బంది కూర్చోవడం, జుట్టు పట్టుకుని ఈడ్చడం, గాయాల నుండి రక్తస్రావమైనా చికిత్స అందించకుండా సంకెళ్లతో మంచానికి బంధించడం వంటి క్రూరమైన చర్యల ద్వారా హింసించినట్లు నివేదిక పేర్కొంది. రక్తస్రావమైనా వైద్యం అందించలేదని పేర్కొంది. శివకుమార్ కుడి పాదం ఎముక, ఎడమచేతిలోని ఓ వేలు విరిగాయని, ఇవేకాక అనేక గాయాలైనట్లు జీఎంసీహెచ్ వైద్యులు తెలిపారు. ఈ ఆధారాలను సాక్ష్యాలతో సహా రికార్డు చేయడం న్యాయవిచారణలో ఇదే మొదటిసారి. ఎస్ఐ షంషేర్ సింగ్, ఇన్‌స్పెక్టర్ రవీందర్, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వినరు కక్రాన్‌లు కుమార్‌పై చిత్రహింసలకు పాల్పడిన నేరస్థులుగా పేర్కొనడంతో పాటు పూర్తిబాధ్యత వహించాలని తెలిపింది. ఈ నెల ప్రారంభంలో విడుదల చేసిన ఈ నివేదికను డిసెంబర్ 20వ తేదీన వెల్లడించారు. కార్మికుల తరఫున పోరాటం చేయడం, కార్మికులకు సరైన వేతనాలు చెల్లించకపోవడం, వేధింపులకు గురిచేయడాన్ని వ్యతిరేకిస్తూ కుండ్లీ ఇండస్ట్రియల్ అసోసియేషన్ ఎదుట ఆందోళన చేపట్టడంతోనే పోలీసులు అతనిని అరెస్టు చేసి క్రూరంగా హింసించారు. మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా ప్రవేశపెట్టిన మూడు వివాదాస్పద వ్యవసాయచట్టాలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టిన రైతులకు ఆయన సంఘీభావం ప్రకటించారు.

5.86 గిగావాట్ల విద్యుత్ అందుబాటులో లేదు: కేంద్రం

న్యూఢిల్లీ: దేశంలో బొగ్గు, లిగ్నైట్ (నేల బొగ్గు) ఆధారిత మొత్తం థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యా (210.6 గిగావాట్లు)ల్లో 5.86 గిగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రాజెక్టులు పనిచేయడం లేదని కేంద్రం పార్లమెంటుకు తెలియజేసింది. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) కింద విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) లేకపోవడం మొదలైన కారణాల వల్ల ఈ పరిస్థితి నెలకొన్నట్లు విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్ లోక్‌సభకు లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. పనిచేయని ప్లాంట్‌లలో బేలా థర్మల్ పవర్ స్టేషన్ (270 మెగావాట్లు)ను అక్టోబర్ 2, 2022న పునరుద్ధరించినట్లు మంత్రి సభకు తెలిపారు. విద్యుత్ విక్రయాల సగటు రేటు యూనిట్‌కు 2019-20లో రూ.3.95, 2018-19లో రూ.3.65 ఉండగా, 2020-21లో రూ.3.40కి తగ్గిందని సభకు మరో సమాధానంలో సింగ్ చెప్పారు. అదేవిధంగా హైడ్రో పవర్ సగటు ధర 2019-20లో రూ.2.71, 2018-19లో రూ. 2.64 ఉండగా 2020-21లో రూ.2.64కి తగ్గింది. అణు విద్యుత్ సగటు ధర కూడా యూనిట్‌కు 2019-20లో రూ. 3.14, 2018-19లో రూ. 3.36 ఉండగా 2020-21లో రూ. 3.11కి తగ్గిందని వివరించారు.

బెయిల్ పిటిషన్ ఉపసంహరణ

పొరపాటున దాఖలు చేసినట్టు తెలిపిన ఆఫ్తాబ్

ఢిల్లీ: ఢిల్లీలో సంచలనం సృష్టించిన శ్రద్ధా వాకర్ హత్యకేసులో బెయిల్ పిటిషన్‌ను నిందితుడు ఆఫ్తాబ్ ఉపసంహరించుకున్నారు. సమాచారం లోపం కారణంగానే ఈ పిటిషన్‌ను వేసినట్టు ఆఫ్తాబ్ కోర్టుకు తెలిపారు. దీంతో అతడి అభ్యర్థనను న్యాయస్థానం కొట్టివేసింది. ఈ కేసులో బెయిల్ కోరుతూ ఆఫ్తాబ్ తరపున న్యాయవాది డిసెంబరు 15న కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, అది బెయిల్ పిటిషన్ అని తనకు తెలియదని, పొరబాటుగా దాఖలైందని ఆ తర్వాత నిందితుడు కోర్టుకు తెలిపాడు. దీనిపై ఢిల్లీలోని సాకేత్ కోర్టు గురువారం విచారణ చేపట్టింది. సమాచారలోపం కారణంగానే ఈ పిటిషన్‌ను దరఖాస్తు చేసినట్లు అఫ్తాబ్ న్యాయవాది చెప్పారు. ఈ దరఖాస్తును ఉపసంహరించుకోవాలని నిందితుడు నిర్ణయించుకున్నట్లు కోర్టుకు తెలిపారు. దీంతో ఈ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు అడిషనల్ సెషన్స్ జడ్జి బృందా కుమారి తెలిపారు. అంతకుముందు ఈ పిటిషన్‌కు ఢిల్లీ పోలీసులు సమాధానమిచ్చారు. ఇది అత్యంత తీవ్రమైన నేరమని, సమాజంపై పెను ప్రభావం చూపించిందని పోలీసులు పేర్కొన్నారు. అందువల్ల, అతడికి బెయిల్ మంజూరు చేయొద్దని కోర్టును కోరారు. ఇటీవల ఆఫ్తాబ్‌ను పాలిగ్రాఫ్ పరీక్షల నిమిత్తం జైలు నుంచి బయటకు తీసుకురాగా.. పోలీసు వాహనంపై కొందరు దాడి చేసిన విషయం తెలిసిందే. అతడు బయటకు వస్తే మళ్లీ అతడిపై దాడి జరిగే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. కోర్టులో కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే హాజరుపరుస్తున్నారు. తన సహజీవన భాగస్వామి అయిన శ్రద్ధా వాకర్‌ను చంపి, ఆమె శరీరాన్ని అతి దారుణంగా ముక్కలు చేసిన ఆఫ్తాబ్‌ను ఢిల్లీ పోలీసులు గత నెల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముమ్మర దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇప్పటికే నిందితుడికి పాలిగ్రాఫ్, నార్కో పరీక్షలు కూడా చేశారు. ఆఫ్తాబ్ చెప్పిన వివరాల ఆధారంగా.. మెహ్రౌలీ అటవీ ప్రాంతంలో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మానవ అవశేషాలను గుర్తించారు. ఆ శరీర భాగాలు శ్రద్ధావేనని డీఎన్ఏ పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. ఇక నిందితుడి ఇంట్లో గుర్తించిన రక్త నమూనాలు కూడా మృతురాలివేనని నిర్ధారించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో పోలీసులు ఇంకా ఛార్జ్‌షీట్ దాఖలు చేయలేదు. ప్రస్తుతానికి నిందితుడు జ్యుడిషియల్ కస్టడీలో తీహార్ జైల్లో ఉన్నాడు.

చైనాతో వాణిజ్య యుద్ధం భారత్‌కే నష్టం: పనగరియా

న్యూఢిల్లీ: చైనాతో భారత్ వాణిజ్య సంబంధాలు తెగతెంపులు చేసుకోవడం వల్ల మనకే నష్టమని నీతి ఆయోగ్ మాజీ వైస్ చైర్మన్ అరవింద్ పనగరియా తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో అలాంటి నిర్ణయం భారత ఆర్థికవృద్ధిని పణంగా పెట్టినట్లే అవుతుందని ఆయన హెచ్చరించారు. దానికి బదులుగా భారత్ ఐరోపా సమాఖ్య, బ్రిటన్‌తో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలు కుదుర్చోవాలని సూచించారు. చైనాతో వాణిజ్య యుద్ధం అంటే మనం మన ఆర్థిక వృద్ధిని త్యాగం చేసినట్లే. ఆర్థికపరంగా చూస్తే అలాంటి నిర్ణయం పూర్తిగా అవివేక చర్య. సరిహద్దుల్లో చొరబాట్లకు ప్రతీకారంగా చైనాను వాణిజ్యపర ఆంక్షలతో శిక్షించాలని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. అలా చేస్తే ఆ దేశం ఊరికే కూర్చోదు. అమెరికా వంటి అగ్రదేశాలు ఆంక్షలు విధించినప్పుడు దాని స్పందన ఎలా ఉంటుందో ప్రపంచానికి చాటిచెప్పింది. రష్యాపై ఆంక్షలు విధించినందుకు ఐరోపా సమాఖ్య భారీ మూల్యమే చెల్లించుకుంటోందని పనగరియా అన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ సెక్టార్‌లో వాస్తవాధీన రేఖ వెంట డిసెంబరు 9న భారత్- చైనా సైనికుల మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ ఘటనలో భారత సైనికులకు స్వల్ప గాయాలయ్యాయి. గతంలో గల్వాన్ లోయలోనూ ఈ తరహా ఘటన జరిగిన విషయం తెలిసిందే. అప్పుడు భారత జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ పరిణామాలతో చైనాతో వాణిజ్య సంబంధాలు వదులుకోవాలని, ఆ దేశ ఉత్పత్తులు నిషేధించాలన్న డిమాండ్ కొన్ని వర్గాల నుంచి వినిపిస్తోందని చెబబుతూ...దాని పర్యవసానాలు ఎలా ఉంటాయో పనగరియా వివరించారు. రెండు దేశాలు వాణిజ్య యుద్ధానికి దిగితే నష్టం భారత్‌కే అధికంగా ఉంటుందని పనగరియా పునరుద్ఘాటించారు. చైనా ఆర్థిక వ్యవస్థ 17 ట్రిలియన్ డాలర్లనీ.. అదే భారత ఆర్థిక వ్యవస్థ మూడు ట్రిలియన్ డాలర్లని గుర్తుచేశారు. అందువల్ల చైనాపై భారత్ విధించే ఆంక్షల కంటే.. భారత్‌పై చైనా విధించే ఆంక్షల ప్రభావమే తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. పైగా అమెరికా వంటి పెద్ద దేశమే.. చైనా, రష్యాపై విధించిన ఆంక్షల నుంచి పెద్దగా ఫలితం పొందలేదని పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్- అక్టోబర్ మధ్య చైనాతో భారత వాణిజ్య లోటు 51.5 బిలియన్ డాలర్లు. ఎగుమతులు 60.27 బిలియన్ డాలర్లు. దీనిపై వివరణ ఇస్తూ.. భారత్ దిగుమతి చేసుకునే చాలా వస్తువులను చైనాయే అత్యంత తక్కువ ధరకు ఇస్తోందని పనగరియా తెలిపారు. అదే భారత్ ఎగుమతులకు మాత్రం చైనా సరైన ధరు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. దీంతో ఆయా వస్తువులను అమెరికా వంటి ఇతర వాణిజ్య భాగస్వామ్య దేశాలకు సరఫరా చేస్తున్నామన్నారు.

పోలవరం ప్రాజెక్టు

దిగువ కాఫర్‌డ్యామ్ డయాఫ్రంవాల్ పూర్తి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
పోలవరం దిగువ కాఫర్‌డ్యామ్ డయాఫ్రం వాల్ పనులు గురువారం పూర్తి అయ్యాయి. 2019 వరదల వల్ల ఈ ప్రాంతంలో ఇసుక కోతకు గురైంది. దీంతో ఆ ప్రాంతంలో కాఫర్‌డ్యామ్ పటిష్టంగా నిర్మించాలంటే డయాఫ్రంవాల్ తప్పనిసరి అని ఇంజినీరింగ్ నిపుణులు నిర్ధారించారు. ఆ మేరకు మేఘా ఇంజినీరింగ్ సంస్థ దాని నిర్మాణం చేపట్టింది. సుమారు 160 మీటర్ల ప్రాంతాన్ని ఇసుక, జియో బ్యాగులతో నింపి వైబ్రో కంపక్షన్ ద్వారా గట్టి పరిచింది.

160 మీటర్లను 58 భాగాలుగా విడగొట్టి డయాఫ్రంవాల్ నిర్మించింది. ఈ నిర్మాణం పూర్తయిన సందర్భంగా జలవనరుల శాఖ అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలవరం ఎస్ఈ నరసింహమూర్తి పర్యవేక్షణలో నిర్మాణం పూర్తి చేసినట్లు ఈఈ పాండురంగయ్య తెలిపారు. మేఘా ఇంజినీరింగ్ సీజీఎం ముద్దుకృష్ణ, ఏజీఎం రాజేష్, సీనియర్ మేనేజర్ మురళి పమ్మి పాల్గొన్నారు.

నిరాడంబరతకు నిదర్శనం

పై చిత్రంలో స్నేహితులతో కలిసి సరదాగా పాటపాడుతూ కనిపిస్తున్న వ్యక్తి ఎవరో కాదు... సీపీఐకి చెందిన కేరళ మంత్రి కే రాజన్. కేబినెట్ మంత్రి హోదాలో ఉండి కూడా ఓ సాధారణ వ్యక్తిలా టీ దుకాణంలో కూర్చోవడం ఆయన నిరాడంబరతకు, ప్రజలతో మమేకమవుతున్న తీరుకు నిదర్శనం. సీపీఐలో అనేకస్థాయిల్లో పనిచేసిన రాజన్(49) 2011 నుంచి శాసనసభ్యుడిగా ఉన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలోని కేరళ వామపక్ష ప్రభుత్వంలో కేబినెట్ మంత్రిగా రెవెన్యూ, భూసంస్కరణలు, గృహ నిర్మాణ శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కేరళ రాష్ట్ర సీపీఐ కార్యవర్గ సభ్యునిగా, సీపీఐ జాతీయ సమితి సభ్యునిగా ఉన్నారు. గతంలో ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శిగా పనిచేశారు. విజయన్ ప్రభుత్వంలో గతంలో చీఫ్ విప్‌గా పనిచేసిన అనుభవం ఉంది. విజయవాడలో అక్టోబర్ 14 నుంచి 18 వరకు జరిగిన సీపీఐ జాతీయ మహాసభలకు ప్రతినిధిగా హాజరయ్యారు.

ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులను ఆదుకోండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణకు విద్యార్థి, యువజన సంఘాల వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
పోలీస్‌శాఖలో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల నియామకాల వయోపరిమితి పెంపుదలకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణకు విజయవాడ దాసరిభవన్‌లో గురువారం ఏఐవైఎఫ్ ఎన్టీఆర్‌జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ తదితరులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల వయోపరిమితి 27 ఏళ్లలోపు ఉండాలని ప్రభుత్వం ప్రకటించడం దారుణమని, అభ్యర్థుల వయోపరిమితి 32 ఏళ్లకు పెంచాలని తాము ప్రభుత్వంపై వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నామని పేర్కొన్నారు. సీఎం జగన్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆవేదనను ఆలకించడం లేదనీ, నిరుద్యోగులు కలిసేందుకు కనీసం అవకాశమూ కల్పించడం లేదన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేపట్టామని, హోంశాఖ మంత్రి తానేటి వనితకు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి వినతిపత్రాలు అంద జేశామని రామకృష్ణకు వివరించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదనీ, ఈ ఉద్యోగాలకు వయోపరిమితి పెంచనందున వేలాది మంది నిరుద్యోగులు అనర్హులవుతున్నారని, సీపీఐ తరపున ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి అభ్యర్థులను ఆదుకునేందుకు కృషి చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నిరుద్యోగులు శంకర్, రాకేశ్, అయ్యప్ప ఉన్నారు.

సీఎం జగన్‌కు రామకృష్ణ లేఖ

ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగ వయోపరిమితి మరో ఐదేళ్లు పొడిగించేందుకు చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్‌కు గురువారం ఆయన ఒక లేఖ రాశారు. దాదాపు నాలుగేళ్ల అనంతరం పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ కోసం జారీజేసిన ప్రకటనలో జనరల్ అభ్యర్థుల వయోపరిమితి 27 సంవత్సరాలలోపు ఉండాలని ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. 2016, 2018లో ఆయా ప్రకటనల మధ్య కాలం ఆధారంగా వయోపరిమితి పెంచేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం వయోపరిమితి 27 సంవత్సరాలుగా ప్రకటించడంతో లక్షలాది మంది నిరుద్యోగ యువత అర్హత కోల్పోయి నష్టపోయే ప్రమాదముందన్నారు. వయోపరిమితిని పెంచాలని కోరుతూ నిరుద్యోగ, యువజన సంఘాలు ఆందోళనబాట పట్టాయని పేర్కొన్నారు. యువత భవితను దృష్టిలో ఉంచుకుని వయోపరిమితి 32 ఏళ్లకు పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో రామకృష్ణ డిమాండ్ చేశారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల షెడ్యూలు విడుదల

గువాహటి:
దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో 2023-24 విద్యా సంవత్సరానికి గాను బీటెక్ కోర్సుల్లో ప్రవేశానికి ఏటా నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష షెడ్యూల్ విడుదలైంది. ఈ పరీక్షను జూన్ 4న నిర్వహించనున్నట్టు ఐఐటీ గువాహటి వెల్లడించింది. జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఏప్రిల్ 30 నుంచి మే 4 వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. రిజిస్టర్ అయిన అభ్యర్థులు మే 5వరకు ఫీజు చెల్లించేందుకు గడువు ఇచ్చింది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో రెండు పేపర్లు ఉండగా.. ఒక్కొక్కటి మూడు గంటల వ్యవధి ఉంటుంది. పేపర్ -1 ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు, పేపర్- 2 మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు జరగనుంది. రెండు పేపర్లూ రాయడం తప్పనిసరి. ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించినప్పటికీ ఈ పరీక్ష తేదీలో ఎలాంటి మార్పు ఉండదని ఐఐటీ గువాహటి పేర్కొంది. విదేశాల్లో ఉన్న విద్యార్థులైతే ఏప్రిల్ 24 నుంచి మే 4వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. పరీక్ష ఫీజు చెల్లించేందుకు మే 5వ తేదీ వరకు వెసులుబాటు కల్పించింది. మే 29 నుంచి జూన్ 4 వరకు అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్‌కు అవకాశం ఉంటుందని తెలిపింది.

అధిక పింఛనుపై సుప్రీం తీర్పు పరిశీలిస్తున్నాం: కేంద్రం

న్యూఢిల్లీ:
ఉద్యోగుల భవిష్యనిధి పింఛను పథకం-2014 సవరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అధ్యయనం చేస్తున్నామని కేంద్రం పార్లమెంట్‌కు తెలిపింది. 2014 సవరణకు ముందు అధిక పింఛను పొందేందుకు ఈపీఎస్‌లో చేరని వారికి సుప్రీంకోర్టు నాలుగు నెలల గడువు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై రాజ్యసభలో ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. కోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలిస్తున్నామని తెలిపారు. పెన్షన్ పథకంపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలుసా? అంటూ వచ్చిన మరో ప్రశ్నకూ ఆయన బదులిచ్చారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో న్యాయ, ఆర్థిక, గణాంకాలకు సంబంధించిన చిక్కులు ఉన్నాయని ఆ సమాధానంలో పేర్కొన్నారు. ఈపీఎఫ్ చట్టంలోని పేరా 11(3) ప్రకారం 2014 నాటి సవరణకు ముందు గరిష్ఠ వేతన పరిమితి రూ.6500గా ఉంది. అంతకు మించి పొందుతున్న ఉద్యోగులు ఈపీఎస్‌లో చేరేందుకు ఆ వేతనంపై 8.33 శాతం పూర్తిగా ఈపీఎస్‌లో జమ చేయాలి. కానీ ఉద్యోగులు ఈ పథకంలో చేరేందుకు గరిష్ఠ గడువు తేదీ ఏమీ చెప్పలేదు. 2014లో గరిష్ఠ వేతన పరిమితిని రూ.15 వేలకు పెంచుతూ కేంద్రం సవరణ చేసింది. దీనికి ముందు ఆప్షన్ ఇచ్చిన ఉద్యోగులు.. ఆరు నెలల్లోగా అధికవేతనంపై ఈపీఎస్‌లో చేరేందుకు ఆప్షన్ ఇవ్వాలని సూచించింది. అప్పుడు ఆప్షన్ ఇవ్వని వారికి మరో అవకాశం కల్పిస్తూ సుప్రీంకోర్టు నవంబర్‌లో ఉత్తర్వులిచ్చింది. ఉద్యోగ విరమణ తర్వాత అధిక పింఛన్ పొందేందుకు ఈపీఎఫ్ చందాదారులకు అవకాశం కల్పిస్తూ తీర్పు వెలువరించి నెల రోజులు దాటింది. అయితే, ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అవసరమైన నిబంధనలను ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ఇప్పటివరకు జారీ చేయలేదు. దీంతో అధిక పింఛన్ వస్తుందన్న ఆశ ఎప్పుడు ఫలిస్తుందోనని చందాదారులు ఆందోళన చెందుతున్నారు. ఈపీఎఫ్ఓ దగ్గర ఈ ఏడాది మార్చి 31 నాటికి కార్పస్ ఫండ్ కింద రూ.18,64,136 కోట్లు ఉందని కేంద్రమంత్రి తేలి పార్లమెంట్‌కు తెలిపారు. ఇందులో రూ.11,37,096.72 కోట్లు ఎంప్లాయీ ప్రావిడెండ్ ఫండ్ స్కీమ్, 1962లో ఉండగా.. రూ.6,89,210.72 కోట్లు పెన్షన్ స్కీమ్, 1995లో ఉన్నాయి. మరో రూ.37,828.56 కోట్లు ఎంప్లాయీ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్, 1976లో ఉన్నాయని తెలిపారు.

తాజ్‌మహల్ వీక్షణకు కరోనా పరీక్ష తప్పనిసరి

ఆగ్రా: చైనా, జపాన్, దక్షిణ కొరియా సహా పలు దేశాల్లో కరోనా మహమ్మారి విజృంభిస్తున్నది. ఒమిక్రాన్ బీఎఫ్-7 రకం కరోనా వైరస్ కారణంగా పలు దేశాల్లో రోజూ వేల సంఖ్యలో కొత్త కేసులు నమోదవుతున్నాయి. దేశంలోనూ ఒమిక్రాన్ బీఎఫ్-7 వేరియంట్ లక్షణాలు గుజరాత్‌లో ఇద్దరిలో, ఒడిశాలో ఒక్కరిలో గుర్తించారు. ఈ క్రమంలో దేశంలోని సుప్రసిద్ధ పర్యాటక ప్రదేశాల్లో ఒకటైన తాజ్‌మహల్ పరిసరాల్లో కూడా కొవిడ్ అలర్ట్ ప్రకటించారు. తాజ్ మహల్ సందర్శనకు వచ్చే పర్యాటకులకు కరోనా నిర్ధారణ పరీక్షలు తప్పనిసరి చేశారు. దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులు అందరికీ ఈ నియమం వర్తిస్తుందని అధికారులు తెలిపారు.

ఆస్కార్‌కు రెండడుగుల దూరంలో 'నాటు నాటు'

హైదరాబాద్:
ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వం వహించిన చిత్రం 'ఆర్ఆర్ఆర్' సృష్టించిన రికార్డుల గురించి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.1200 కోట్ల వసూళ్లు సాధించింది. అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ప్రముఖుల ప్రశంసలు సైతం పొందింది. అలాగే అనేక అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అవార్డులు కూడా గెలుచుకుంది. తాజాగా మరో అవార్డుకు రెండడగుల దూరంలో నిలిచింది. ప్రపంచంలోని సినీ పురస్కారాల్లో ఆస్కార్‌కు ఉన్న క్రేజ్ గురించి తెలిసిందే. ఈ ప్రతిష్టాత్మక అవార్డుల కార్యక్రమంలో అనేక విభాగాల కోసం ఈ చిత్రం పోటీకి నిలిచింది. తాజాగా ఆస్కార్స్‌లోని 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో పోటీ పడేందుకు 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' సాంగ్ షార్ట్ లిస్ట్ అయ్యింది. ఈ విభాగంలో ప్రపంచవ్యాప్తంగా మొత్తం 81 పాటలు పోటీపడగా.. అందులో నుంచి టాప్ 15 పాటలను ఈ అవార్డుల కమిటీ విడుదల చేసింది. అందులో 'నాటు నాటు' పాటకి కూడా చోటు దక్కడం విశేషం. ఈ 15 పాటల నుంచి కేవలం ఐదు పాటలు మాత్రం ఆస్కార్స్ అఫిషీయల్ నామినేషన్స్‌కి అర్హత సాధిస్తాయి. అంటే ఈ పాట ఆస్కార్ అవార్డుకి రెండడుగుల దూరం నిలిచిందన్నమాట. కాగా.. ఇండియా నుంచి ఆస్కార్ అవార్స్ నామినేషన్స్‌కి షార్ట్ లిస్ట్ అయిన మొదటి సాంగ్ ఇదే కావడం విశేషం. ఈ విషయాన్ని తెలుపుతూ ఈ మూవీ నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఓ ట్వీట్ చేసింది. అందులో సపోర్టు చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపింది.

సైకో పాలన నుండి రాష్ట్రాన్ని కాపాడండి

చంద్రబాబు పిలుపు

విశాలాంధ్ర-పొందూరు(శ్రీకాకుళం):
మితిమీరిన ఆగడాలతో పాలన సాగిస్తున్న సైకో జగన్‌రెడ్డి నుంచి రాష్ట్రాన్ని కాపాడాలని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా రాజాంలో ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా స్థానిక అంబేద్కర్ జంక్షన్‌లో చంద్రబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ ద్వంద్వ వైఖరిపై ధ్వజమెత్తారు. వైసీపీ ఆగడాలకు హద్దు లేకుండా పోయిందని విమర్శించారు. దౌర్జన్యాలు, ఇళ్లు కూల్చివేతలు, అక్రమ అరెస్టులు, ఆక్రమణలు, అవినీతి తప్ప వైసీపీ పాలనలో ఏముందని ప్రశ్నించారు. సైకోలు ఒళ్లు దగ్గర పెట్టుకుని ప్రవర్తించకపోతే భవిష్యత్ పరిణామాలకు బాధ్యత వహించక తప్పదని హెచ్చరించారు. జగన్ పాలనలో సామాన్యులకు రక్షణ కరువైందన్నారు. కరెంటు, గ్యాస్ ధరలు పెరిగాయని, ఇంటి పన్ను, చెత్తపన్నుతో ప్రజలపై భారం మోపిందని నిందించారు. ఉత్తరాంధ్రపై జగన్‌రెడ్డి చవితి తల్లి ప్రేమ చూపిస్తున్నారన్నారు. జగన్‌పై తిరుగుబాటు చేయాలని పిలిచారు. బాబు వస్తే గానీ జాబు రాదన్న పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఇంటికో తెలుగుదేశం జెండా పట్టుకొని ముందుకొస్తే మనం గెలవడం పెద్దకష్టం కాదన్నారు. పిడికెళ్లు బిగించి సైకో సర్కారును ఇంటికి పంపాలన్నారు. అక్రమ కేసులతో అచ్చంనాయుడు, కూన రవికుమార్‌లను ఇబ్బందులకు గురిచేశారన్నారు. తాను తలుచుకుంటే జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర ముందుకు కదిలేదా అని ప్రశ్నించారు. వైసీపీ విధ్వంస పాలనతో ఐటీ కంపెనీలు, పరిశ్రమలు రాష్ట్రం నుంచి తరలిపోతున్నాయన్నరు. స్పీకర్ తమ్మినేని సీతారాంపైనే విమర్శలు గుప్పించారు. అక్రమ కేసులకు టీడీపీ భయపడబోదని స్పష్టంచేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చంనాయుడు, జిల్లా పార్టీ అధ్యక్షుడు కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

చిలకపాలెం వద్ద చంద్రబాబుకు ఘన స్వాగతం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా రాజాంలో పాల్గొనేందుకు విచ్చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు గురువారం సాయంత్రం చిలకపాలెం జంక్షన్ వద్ద ఘన స్వాగతం లభించింది. పోలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావు సారథ్యంలో నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలివచ్చారు. నిర్దేశించిన సమయం కంటే మూడు గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.15 నిమిషాలకు చంద్రబాబు చిలకపాలెం చేరుకున్నారు. వాహనంపై నుంచే చంద్రబాబు ప్రజలకు అభివాదం తెలిపారు. మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి, శ్రీకాకుళం మాజీ శాసనసభ్యులు గుండ లక్ష్మీదేవి, మాజీ జిల్లా అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, చంద్రబాబు పర్యటనకు కార్యకర్తల సమీకరణ చేయలేకపోయారు. కళా వెంకటరావుకు వ్యతిరేకంగా గ్రూపులు ఉన్నట్లు ఫ్లెక్సీలో బాహాటంగానే కనిపించింది.

చెలరేగిన ఉమేశ్, అశ్విన్

- 227 పరుగులకు కుప్పకూలిన బంగ్లాదేశ్
- టీమిండియా 19/0

మిర్పూర్:
బంగ్లాదేశ్‌తో రెండో టెస్ట్‌లో టీమిండియా బౌలర్లు ఉమేశ్ యాదవ్ (4/25), రవిచంద్రన్ అశ్విన్(4/71) నాలుగేసి వికెట్లతో చెలరేగారు. దాంతో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 73.5 ఓవర్లలో 227 పరుగులకు కుప్పకూలింది. బంగ్లాదేశ్ బ్యాటర్లలో మోమినల్ హక్(15 బంతుల్లో 12 ఫోర్లు, సిక్స్‌తో 84) ఒంటరి పోరాటం చేయగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. 12 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత టెస్ట్ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చిన జయదేవ్ ఉనాద్కత్ రెండు వికెట్లతో సత్తా చాటాడు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్‌కు ఉనాద్కత్ గట్టి షాకిచ్చాడు. బంగ్లాదేశ్ ఓపెనర్ జాకీర్ హసన్(15) క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. అశ్విన్ వేసిన ఆ మరుసటి ఓవర్‌లోనే మరో ఓపెనర్ నజ్ముల్ హోస్సెన్ షాంటో(24) ఎల్బీగా వెనుదిరిగాడు. దాంతో క్రీజులోకి వచ్చిన మోమినల్ హక్, కెప్టెన్ షకీబ్ అల్ హసన్ మరో వికెట్ పడకుండా తొలి సెషన్ ముగించారు. దాంతో బంగ్లాదేశ్ 82/2 స్కోర్ వద్ద లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. లంచ్ బ్రేక్ అనంతరం ఉమేశ్ యాదవ్ వేసిన తొలి బంతికే షకీబ్ అల్ హసన్ క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. క్రీజులోకి వచ్చిన ముష్ఫికర్ రహీమ్ (26) తో మోమినల్ హక్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో అతను 78 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. క్రీజులో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని ఉనాద్కత్ విడదీశాడు. కీపర్ క్యాచ్‌గా రహీమ్‌ను పెవిలియన్ చేర్చాడు. అనంతరం లిటన్ దాస్(25) కూడా క్రీజులోకుదురుకునే ప్రయత్నం చేయగా.. అశ్విన్ దెబ్బతీశాడు. ఆ తర్వాత వచ్చిన మెహదీ హసన్(15), నురుల్ హసన్(6) వరుస విరామాల్లో వెనుదిరిగారు. దాంతో బంగ్లాదేశ్ 221/7తో టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆ వెంటనే టస్కిన్ అహ్మద్(1) వికెట్ కోల్పోయిన బంగ్లాదేశ్.. క్రీజులో పాతుకుపోయిన మోమినల్ హక్‌తో పాటు టెయిలండర్ ఖలెద్ అహ్మద్(0)లను అశ్విన్ ఔట్ చేయడంతో తొలి ఇన్నింగ్స్‌ను ముగించింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ వికెట్ నష్టపోకుండా నిలకడగా ఆడుతోంది.

మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను పక్కన పెడతారా? గవాస్కర్

న్యూఢిల్లీ:
బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌కు సీనియర్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను పక్కనబెట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తొలి టెస్టులో అద్భుతంగా రాణించిన కుల్‌దీప్‌ను తప్పించి.. ఆ స్థానంలో జయ్‌దేవ్ ఉనద్కత్‌ను జట్టులోకి తీసుకున్నారు. దీనిపై టీమిండియా మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ స్పందిస్తూ.. జట్టు మేనేజ్‌మెంట్‌పై వ్యంగ్యాస్త్రాలు గుప్పించాడు. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను జట్టు నుంచి తొలగించడం నమ్మశక్యంగా లేదు. ఈ సమయంలో నేను చెప్పగలిగే ఒకే ఒక్క మాట ఇది. నేను చాలా తీవ్రమైన పదాలే ఉపయోగించొచ్చు.. కానీ తొలి టెస్టులో మొత్తం 20 వికెట్లకు 8 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన ఆటగాడిని పక్కనబెట్టడం నాకు అస్సలు నమ్మశక్యంగా అన్పించట్లేదు" అని ఓ మీడియా ఛానల్‌కు కామెంట్రీ చేస్తూ గవాస్కర్ వ్యాఖ్యానించాడు. అయితే కుల్‌దీప్ కాకుండా జట్టులో మరో ఇద్దరు స్పిన్నర్లు (అక్షర్ పటేల్, అశ్విన్) ఉన్నారని, వారిలో ఎవరో ఒకరిని తొలగించాల్సిందని అభిప్రాయపడ్డాడు. కుల్‌దీప్‌ను జట్టు నుంచి తప్పించడంపై సోషల్‌మీడియాలోనూ విమర్శలు వస్తున్నాయి. కాగా.. అంతకుముందు టాస్ సందర్భంగా తాత్కాలిక సారథి కేఎల్ రాహుల్ మాట్లాడుతూ.. కుల్‌దీప్‌ను పక్కనబెట్టడం కఠినమైన నిర్ణయమే అని అన్నాడు. అయితే అన్ని రకాల బౌలింగ్ దళాన్ని తీసుకోవాలనే ఉద్దేశంతోనే అలా చేశామన్నాడు. 'కుల్‌దీప్‌ను వదులుకోవడం దురదృష్టకరమైన నిర్ణయమే. కానీ ఉనద్కత్‌కు ఓ మంచి అవకాశం" అని రాహుల్ తెలిపాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.